

వైసీపీ విధేయ అధికారికి కీలక పోస్టు

డీఆర్‌డీఏ పీడీగా జయచంద్రకు పోస్టింగ్ ఇచ్చే అవకాశం

- వైసీపీ హయాంలో రెచ్చిపోయిన అధికారి
- వాట్సాప్ గ్రూపుల్లో ఆ పార్టీ అనుకూల పోస్టులు
- చంద్రబాబుకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు
- ఎన్నికల కోడ్‌లోనూ వాట్సాప్ డీపీగా జగన్ ఫొటో
- సామినేని ఉయభానుకు ప్రియ శిష్యుడు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వివాదాస్పదుడు, పంచాయితీ మాజీ అధికారి (డీపీవో), వైసీపీ వీరభక్త అధికారి జయచంద్ర గాంధీకి కూటమి ప్రభుత్వంలో ఎన్టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) పోస్టు ఇవ్వటానికి రంగం సిద్ధమైంది. సార్వత్రిక ఎన్నికల కోడ్ సమయంలో కూడా భయం లేకుండా నాటి అధికార పార్టీకి ఈయన వీరవిధేయుడిగా పనిచేసి రివర్షన్ అందుకున్నారు.

వైసీపీ విధేయుడిగా..

వైసీపీ, జగన్ అంటే వీరాభిమానం ఉన్న జయచంద్ర గాంధీ తాను ఒక అధికారినని మరిచిపోయి గత ఐదేళ్లలో వాట్సాప్ గ్రూపుల్లో వైసీపీ అనుకూల పోస్టులతో రెచ్చిపోయారు. ఒక అధికారిగా ఇలాంటి పోస్టులు పెట్టడం తగదని కామెంట్లు చేసినా ఖాతరు చేసేవారు కాదు. నాటి సీఎం జగన్, ఆయన సతీమణి భారతి పట్ల విపరీతమైన ప్రేమాభిమానాలు చాటేవారు. ఎన్నికల నేపథ్యంలో నిబంధనలను అమలు చేసే విషయంలో జరుగుతున్న లోటుపాట్లు, వైసీపీ లోపాలను ఎత్తిచూపుతూ పత్రికల్లో కథనాలు రాగా, ..ఆ రెండు పత్రికలంటూ ఆయన ఎంపీడీవోల గ్రూపులో అక్కసు వెళ్లగక్కేవారు. తన పర్సనల్ వాట్సాప్ నెంబర్‌లో జగన్ ఫొటోను డీపీగా పెట్టుకునేవారు. ఎన్నికల ముందు, కోడ్ సమయంలో ఇలాంటి పద్ధతి మంచిది కాదని అప్పటి కలెక్టర్ ఢిల్లీరావు పలుమార్లు హెచ్చరించినా జయచంద్ర ఖాతరు చేయలేదు. తన వ్యక్తిగత వ్యవహారమని కలెక్టర్‌తోనే వాదులాటకు దిగేవారు. పలుమార్లు చెప్పినా వినకపోవటంతో ఆయనపై బదిలీ వేటు వేశారు. అప్పటి జగ్గయ్యపేట వైసీపీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సిఫారసుతో ఎన్టీఆర్ జిల్లా డీపీవోగా వచ్చారు. సామినేని ఉదయభాను అంటే జయచంద్ర గాంధీకి అపారమైన గౌరవం. ఆయన కనిపిస్తే సాష్టాంగ నమస్కారం చేస్తుంటాడు. డీపీవోగా ఎంపికయ్యాక చిల్లకల్లులోని ఎండీవో కార్యాలయంలోని శ్రీశక్తి భవన్ పైఅంతస్తులో ఎమ్మెల్యే కోసం ఏకంగా ఆఫీసునే కట్టించారు. లక్షల రూపాయలు వెచ్చించి మరీ చాంబర్‌ను తీర్చిదిద్దారు. తాజాగా.. మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జనసేనలో చేరారు. దీంతో సామినేని ఉదయభాను సహాయ, సహకారాలతో కూటమి ప్రభుత్వంలో చక్రం తిప్పడానికి సదరు అధికారి సిద్ధమైపోయారు. దీంతో డీఆర్‌డీఏ పీడీ పోస్టుపై ఆయన దృష్టిపెట్టారు. సామినేని సహకారం కూడా తోడవటంతో ఫైల్ చకచకా సెక్రటేరియట్‌కు చేరింది. ఈ పోస్టు కోసం జయచంద్రతో పాటు ఏఎన్‌వీ నాంచారరావు అనే వ్యక్తి కూడా పోటీ పడుతుండగా, జయచంద్రకే పోస్టింగ్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జిల్లా రైతులను వరుణుడి భయం వెంటాడుతోంది. రెండు, మూడు రోజుల నుంచి అక్కడక్కడ వర్షాలు పడి పనలపై ఉన్న పంట తడవడంతో ఆందోళన చెందుతున్నారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం కాపాడుకునేందుకు అనేక అవస్థలు పడుతున్నారు. గురు, శుక్రవారాల్లో కూడా వర్షాలు పడే అవకాశం ఉండటంతో పంట నీటిపాలవుతుందని భయపడుతున్నారు.



బస్తాలకు ఎత్తిన ధాన్యం

వరి కోతలు వాయిదా వేయండి : జేసీ

అల్పపీడనం ప్రభావం కారణంగా కోస్తా తీరం వెంబడి రెండు రోజుల పాటు వర్షాలు పడతాయనే హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలను రైతులు తాత్కాలికంగా వాయిదా వేయాలని జేసీ గీతాంజలి శర్మ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉయ్యూరు, పామర్రు, గుడివాడ, మచిలీపట్నం మండలాల్లోని స్టాక్ పాయింట్ల వద్ద టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచామని తెలిపారు. రాశులుగా ఉన్న ధాన్యం తడవకుండా వీటిని వినియోగించుకోవాలని కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది ఎదురైనా కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ 8247693551 నంబరుకు తెలియజేయాలని పేర్కొన్నారు.

గుండెల్లో గుబులు

- జిల్లాలో అక్కడక్కడా చిరుజల్లులు
- తడిచిన పనలపై ఉన్న పంట
- నేడు, రేపు కోస్తాతీరం వెంబడి భారీ వర్ష సూచన
- ధాన్యం రాశులను భద్రపరచుకునే పనిలో రైతులు బిజీ
- స్టాక్ పాయింట్ల వద్ద అందుబాటులో టార్పాలిన్‌లు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలోని గుడివాడ, మోపిదేవి, గుడ్లవల్లేరు, మచిలీపట్నం, అవనిగడ్డ తదితర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి ఒక మోస్తరు వర్షం కురిసింది. పనలపై ఉన్న వరి, పంట కోతకు సిద్ధమై నేలవాలిన వరిపంట కొంతమేర తడిచింది. బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై మధ్యాహ్నం నుంచి మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు కురి శాయి. వాతావరణశాఖ హెచ్చరికలతో వరికోతలను రైతులు నిలిపివేశారు.

పనలపై పంట

మోపిదేవి మండలంలోని పెదకళ్లేపల్లి, వెంకటాపురం, పెదప్రోలు, మచిలీపట్నం మండలంలోని తుమ్మలచెరువు, యాదర, పామర్రు, ఉయ్యూరు, గుడివాడ తదితర ప్రాంతాల్లో వరి కోతలు కోసి పంట పనలపై ఉంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో పంట కొంతమేర తడిచింది. వీటిని ఆరబెట్టే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. యంత్రాల ద్వారా కోత కోసి ఆరబెట్టిన ధాన్యం రాశులుగా పోగు చేసి పరదాలు కప్పి భద్రపరిచారు.

2.92 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు 80 వేల హెక్టార్లకుపైగా వరి కోతలు పూర్తయ్యాయి. 2.92 లక్షల టన్నుల ధాన్యం 33,343 మంది రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసింది. రూ.643.58 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది. కృష్ణాజిల్లాతో పాటు మండపేట, బాపట్ల, సూళ్లురుపేట తదితర ప్రాంతాలకు ధాన్యం విక్రయించుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో రైతులకు కొంతమేర ఉపశమనం లభించింది.

మినుము పైరుపై వర్షాల ప్రభావం

ఇప్పటికే జిల్లాలో 80 వేల హెక్టార్లలో వరి కోతలు పూర్తి చేశారు. మరో 85 వేల హెక్టార్లలో కోతలు పూర్తిచేయాల్సి ఉంది. కోత కోసే రెండు, మూడు రోజుల ముందే రైతులు పొలంలో రెండో పంటగా మినుము చల్లారు. ప్రస్తుతం మినుము రెండాకులు, ఐదు ఆకుల (బిళ్లాకు)దశలో ఉంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో మినుము పైరుకు ఇబ్బంది లేదని, మరింతగా వర్షం కురిస్తే రెండాకుల దశలో ఉన్న మినుముపైరు చనిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. యంత్రాల ద్వారా వరికోతలు పూర్తి చేసిన పొలాలను దమ్ము చేసి రైతులు మినుము విత్తనాలు చల్లారు. ఈ దశలో భారీ వర్షం కురిస్తే మళ్లీ మినుము విత్తనాలు చల్లాల్సి వస్తుందని రైతుల్లో ఆందోళన నెలకొంది. మినుముపైరును కాపాడుకునేందుకు కంకిపాడు మండలంలోని రైతులు కొత్త చిట్కాను పాటిస్తున్నారు. రెండు కిలోల పంచదార, కిలో యూరియాను నీటిలో 24 గంటల పాటు నానబెట్టి ఎకరానికి రెండు వందల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే మినుము మొక్కలు పొలంలో ఉన్న అధిక తేమశాతం నుంచి తెప్పరిల్లుతాయని రైతులు చెబుతున్నారు.



మచిలీపట్నం మండలంలోని ఓ పొలంలో ఆరబెట్టిన ధాన్యం



చురుగ్గా సాగుతున్న గన్నవరం-నూజివీడు రోడ్డు పనులు

> ఉమ్మడి కృష్ణాజిల్లాలో నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆర్థిక సహకారంతో చేపట్టిన ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణ పనులు పరుగులు పెడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ముఖం చాటేసిన సబ్ కాంట్రాక్టర్లు కూటమి ప్రభుత్వం రాకతో నూతన ఉత్సాహంతో పనిచేస్తున్నారు. నాడు రెండు చోట్లే పనులు జరగ్గా, నేడు తొమ్మిది చోట్ల పనులు చేపట్టారు. ఇందులో గన్నవరం- నూజివీడు రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఇక పరుగులే!

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 11 ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణ
- వైసీపీ ప్రభుత్వంలో రెండు చోట్లే పనులు
- మిగిలిన 9 రోడ్లకు కూటమి ప్రభుత్వంలో కదలిక
- గన్నవరం - నూజివీడు రోడ్డు విస్తరణ పనులు ముమ్మరం
- ఆర్థిక సహకారం అందిస్తున్న నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్
- సబ్ కాంట్రాక్టర్లే పనులు చేస్తుండటంతో నాణ్యతపై అనుమానాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) ఆర్థిక సహకారంతో 11 ఆర్‌అండ్‌బీ రోడ్లను డబుల్ లేన్ రోడ్లుగా విస్తరించేందుకు నిర్ణయించారు. రూ.234 కోట్ల వ్యయంతో అంచనాలు రూపొందించి టెండర్లు పిలిచారు. వృద్ధి కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ ఈ పనులను దక్కించుకుంది. ఆ తర్వాత పనులన్నింటినీ సబ్ లీజులకు కట్టబెట్టింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్ల పనులు సక్రమంగా జరగలేదు. ఆ తర్వాత సబ్‌లీజులు పొందిన కాంట్రాక్టు సంస్థలు బిల్లులు రావన్న ఉద్దేశంతో పనులు ఆపివేశారు. దీంతో ఒకటి రెండు రోడ్లు తప్పితే మిగిలిన రోడ్లు విస్తరణకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో సబ్ కాంట్రాక్టర్లలో కూడా బిల్లులు వస్తాయన్న ధీమా పెరిగింది. ప్రభుత్వం స్థాయిలో కూడా ఎన్‌డీబీ రోడ్ల పనులకు సంబంధించి సమీక్ష చేసి సమస్యలను పరిష్కరించడంతో ఇటీవలే గ్రౌండ్ సర్వేయింగ్ పనులు జరిగాయి. తాజాగా గన్నవరం - నూజివీడు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులను సబ్ లీజు పొందిన కాంట్రాక్టర్ చేపట్టారు. గ్రామాల్లో సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సిమెంట్ రోడ్లను కూడా వేస్తున్నారు. గ్రామాల బయట నుంచి బీటీ లేయర్ వేసేందుకు వీలుగా రోడ్డును విస్తరించి వెట్ మిక్స్, హాట్ మిక్స్ పనులు చేస్తున్నారు. ఈ పనుల్లో భాగంగా మధ్యలో కల్వర్టుల పనులు కూడా చేపడుతున్నారు.

వృద్ధి కన్‌స్ట్రక్షన్స్‌దే పూర్తి బాధ్యత

గన్నవరం - నూజివీడు రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సంస్థ నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తుందా లేదా అన్నది నాణ్యతా పరీక్షలో తేలనుంది. ఎన్‌డీబీ మార్గదర్శకాల ప్రకారం పనులు చేయకపోతే బిల్లులు ఆపివేయడంతో పాటు బ్లాక్ లిస్టులో పెట్టే ప్రమాదం కూడా ఉంది. జిల్లా వ్యాప్తంగా చేపట్టే పనులకు వృద్ధి కన్‌స్ట్రక్షన్స్ మాత్రమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ సంస్థ సబ్‌లీజులకు ఇచ్చినప్పటికీ ఆయా సంస్థల మీద ఆర్‌అండ్‌బీ పర్యవేక్షణ చేయదు. దాదాపుగా అన్ని రోడ్లను వృద్ధి కన్‌స్ట్రక్షన్స్ సబ్ లీజులకు ఇవ్వటంతో.. ఎక్కడైనా తప్పులు జరిగితే.. మొత్తం రోడ్ల మీద ప్రభావం చూపుతుంది. సబ్ లీజుదారులు లాభాపేక్షతోనే పనులు చేస్తుంటారు. వాళ్లు నాసిరకంగా పనులు చేస్తే వృద్ధి కన్‌స్ట్రక్షన్స్ సంస్థ బాధ్యత వహించాల్సి ఉంటుంది.



కల్వర్టు నిర్మాణ పనులు

ఎ.కొండూరు ఎంపీడీవో అకాల మృతి

బిడ్డకు జన్మనిచ్చి గుండెపోటుకు గురై

ఎ.కొండూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎ.కొండూరు ఎంపీడీవో పి.హరిప్రియ (39) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతిచెందారు. ఆమె 2018లో గ్రూప్-1 పరీక్షలో విజయం సాధించి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎంపీడీవోగా విధులు నిర్వహించారు. కొద్దికాలం తరువాత కమిషనర్ కార్యాలయంలో పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఎ.కొండూరు ఎంపీడీవోగా గత అక్టోబరు 9న బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ అభివృద్ధికి ఆమె అధికారులను సమన్వయపరిచారు. నవంబరు 15న మెటర్నిటీ సెలవుపై వెళ్లారు. కాగా, కాన్పు కోసం హరిప్రియను విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. బిడ్డకు జన్మనిచ్చిన హరిప్రియ తీవ్ర అనారోగ్యానికి గురై గుండెపోటుకు గురయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు. కష్టపడి గ్రూప్-1 ఉద్యోగం సాధించిన హరిప్రియ మృతికి మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు.



హరిప్రియ(ఫైల్)

భవానీల దీక్ష విరమణకు పకడ్బందీ ఏర్పాట్లు

8లో

20న పెనమలూరులో సీఎం చంద్రబాబు పర్యటన

- ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

6లో

మ్యుటేషన్ స్కామ్‌పై విచారణ ఎప్పుడు?

- గుడివాడ మున్సిపాల్టీలో అవినీతి బాగోతంపై చర్యలు శూన్యం
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో 143 మ్యుటేషన్‌లు
- చేతులు మారిన కోట్లాది రూపాయలు
- 8 నెలల కిందట విచారణకు ఆదేశించిన అధికారులు
- నేటి వరకు ప్రారంభంకాని విచారణ



గుడివాడ మున్సిపాల్టీలో మ్యుటేషన్ స్కామ్‌పై విచారణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 143 మ్యుటేషన్‌లు జరిగాయి. ఈ వ్యవహారంలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. దీనిపై నిగ్గుతేల్చేందుకు ఎనిమిది నెలల కిందట అ ధికారులు విచారణకు ఆదేశించారు. నాటి నుంచి నేటి వరకు విచారణ అసలు ప్రారంభమే కాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

6లో

ఎయిర్‌పోర్టు రోడ్డు సుందరీకరణకు రూ.6.48 కోట్లతో పనులు

8లో

దుర్గమ్మకు కానుకల ఆదాయం రూ.3.68 కోట్లు

వాణిజ్య పన్నుల శాఖలో దుమారం

- 2022లో ఉద్యోగుల ఆందోళనపై ఫిర్యాదు
- మొత్తం 53 మందిపై అభియోగాల నమోదు
- సుదీర్ఘకాలంగా సాగుతున్న విచారణ
- తాజాగా 13 మందికి నోటీసులు
- కీలకమైన వారిని వదిలి మిగతా వారికి షోకాజ్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వాణిజ్య పన్నుల శాఖలో ఓ అధికారి ఫిర్యాదుకు సంబంధించిన విచారణ వ్యవహారం దుమారం రేపుతోంది. ఫిర్యాదులో పేర్లున్న వారిలో కొంతమందికి షోకాజ్ నోటీసులు జారీచేసి, కీలకంగా వ్యవహరించిన ఉద్యోగుల విషయంలో అధికారులు మౌనం దాల్చడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బదిలీల రచ్చ

వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలు చేయాలని 2022లో వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. సుదీర్ఘకాలంగా విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్న వారిని పొరుగు జిల్లాలకు బదిలీ చేయాలని భావించారు. ఈ ప్రక్రియను కౌన్సెలింగ్ విధానంలో నిర్వహించాలనుకున్నారు. ఈ బదిలీలను నిలుపుదల చేయాలని ఏపీసీటీ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆనాడు ఈ సంఘానికి కేఆర్ సూర్యనారాయణ నేతృత్వం వహించారు. ఆయన ఆధ్వర్యంలో ఉద్యోగులు దశలవారీగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నాడు చీఫ్ కమిషనర్ కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న కృష్ణారెడ్డి చాంబర్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. ఆయన్ను చుట్టుముట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి 53 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. వారంతా కేఆర్ సూర్యనారాయణకు అత్యంత సన్నిహితులు. ఆయన సంఘంలో వివిధ పదవుల్లో ఉన్నారు. నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు తనపై దూకుడుగా ప్రవర్తించారని కృష్ణారెడ్డి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వారు విచారణకు ఆదేశించారు.

మలుపులు తిరుగుతున్న విచారణ

కృష్ణారెడ్డి ఫిర్యాదుపై విచారణ కొద్దినెలలుగా జరుగుతోంది. అధికారి ఫిర్యాదులో పేర్కొన్న పేర్లతో పాటు నాడు చాంబర్‌లోకి దూసుకెళ్లిన ఉద్యోగులను ఒక్కొక్కరినీ పిలిచి విచారణ చేస్తున్నారు. ఈ ఆందోళనకు సంఘంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న కేఆర్ సూర్యనారాయణ, ప్రకాశం జిల్లాకు చెందిన రమేశ్ నాయకత్వం వహించారు. ఈ ఘటన జరిగిన కొన్నాళ్లకు నిధులు దుర్వినియోగం చేశారన్న అభియోగంపై సూర్యనారాయణతో పాటు కొంతమందిపై విజయవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. నాడు నిరసనలో పాల్గొన్న వారిని విచారణ చేయగా, ఈ రెండు పేర్లు వినిపించినట్టు తెలిసింది. విచారణ తుదిదశకు చేరుకోవడంతో చర్యలు ఎందుకు తీసుకోకూడదో చెప్పాలని అధికారులు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

వారిని వదిలేశారేం..

విచారణను ఎదుర్కొన్న 13 మంది ఉద్యోగులకే నోటీసులు అందడంతో వివాదం ముదురుతోంది. సీసీ కెమెరాల్లో ఎవరెవరు అధికారి చాంబర్‌లోకి వెళ్లారో స్పష్టంగా తెలిసి, విచారించిన తర్వాత కొంతమందికి మాత్రమే నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా కేఆర్ సూర్యనారాయణ, రమేశ్‌కు నోటీసులు ఇవ్వకపోవడం మిగిలిన ఉద్యోగుల్లో అసంతృప్తి మంటలు రేగుతున్నాయి. సంఘాలకు నాయకులుగా వ్యవహరించిన వారిని వదిలేసి మిగిలిన ఉద్యోగులను బలిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. దీంతో వాణిజ్య పన్నుల శాఖలోని వివిధ డివిజన్లలో పనిచేస్తున్న ఉద్యోగులు వర్గాలుగా విడిపోయారు. విచారణాధికారుల తీరుపైనా విమర్శలు చేస్తున్నారు. 2022లో జరిగిన ఘటనకు సంబంధించిన అన్ని వివరాలను వాంగ్మూలంగా ఇచ్చామని చెబుతున్నారు. పెద్దలుగా ఉన్న వారిని వదిలేసి తమపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికే చేస్తున్నారని మండిపడుతున్నారు.

మ్యుటేషన్ దుమారం!



గుడివాడ పురపాలక సంఘ కార్యాలయం

- గుడివాడ మున్సిపాలిటీలో ఏడాదిలో రూ.కోట్ల కుంభకోణం!
- వైసీపీ ఐదేళ్ల పాలలో నిగ్గుతేలాల్సినవెన్నో..
- ఎనిమిది నెలలుగా ముందుకుసాగని విచారణ!
- ఆర్డీ స్థాయి అధికారి విచారిస్తే నిజాలు బట్టబయలు
- మున్సిపల్ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే వెనిగండ్ల చొరవ చూపాలి

గుడివాడ మున్సిపాల్టీలో మ్యుటేషన్ కుంభకోణంపై విచారణ నత్తనడకన సాగుతోంది. కోట్లాది రూపాయలు పక్కదారి పట్టించిన వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మున్సిపల్ అధికారులు బదిలీపై వెళ్లిపోయారు. నలుగురు కమిషనర్ల హయాంలో కుంభకోణం జరగడంతో విచారణకు అధికారులు ముందుకు రావడం లేదని కార్యాలయవర్గాలే బాహాటంగానే పేర్కొంటున్నాయి. జరిగిన కుంభకోణంపై రాజమండ్రి ఆర్జేడీ ఎస్వీవీ సత్యనారాయణ సమగ్ర విచారణకు ఆదేశించారు. అధికారులు మారిపోతున్నా విచారణ అడుగు ముందుకు పడకపోవడం గమనార్హం.

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

గుడివాడ మున్సిపాల్టీలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 143 మ్యుటేషన్ల విషయంలో కోట్లాది రూపాయల 'గోల్‌మాల్' జరిగినట్టు ఉన్నతాధికారులు తేల్చారు. ఒక్క రూపాయి కూడా ఖజానాకు జమ చేయకుండా మ్యుటేషన్ చేశారని గుర్తించారు. ఈ భారీ కుంభకోణంపై తొలుత రాజమండ్రి ఆర్జేడీ ఎస్వీవీ సత్యనారాయణ స్వయంగా గుడివాడ వచ్చి ఆన్‌లైన్‌లో పరిశీలించి ఏప్రిల్ 4న సమగ్ర విచారణ చేయాలని చేయాలని నాటి కమిషనర్ బాలసుబ్రహ్మణ్యంను ఆదేశించారు. ఆదేశాలిచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇప్పటికీ క్షేత్రస్థాయిలో అడుగు కూడా ముందుకు పడలేదు.

విచారణ అధికారికి బెదిరింపులు?

మ్యుటేషన్‌లో జరిగిన అవినీతి నిగ్గుతేల్చేందుకు నాటి మున్సిపల్ కమిషనర్ సకాలంలో స్పందించకపోవడంతో ఆర్డీ నాగ నరసింహారావు జూలై 25న విచారణాధికారిగా మున్సిపల్ కార్యాలయ అకౌంట్స్ ఆఫీసర్ జీటీ నాయుడును నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. అయితే ఆయనకు బెదిరింపులు రావడంతో విచారణ నుంచి తప్పుకున్నట్టు కార్యాలయవర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రస్తుత విచారణాధికారి ఎక్కడ.?

విచారణాధికారిగా జీటీ నాయుడు తప్పుకోవడంతో ఆర్డీ నాగ నరసింహారావు తాడిగడప కమిషనర్ భవాని ప్రసాద్‌ను తిరిగి నియమించారు. ఇప్పటికి మూడు నెలలు కావస్తున్నా ఆయన గుడివాడ వచ్చింది లేదు. దీనిపై ఆయన్ను సంప్రదించగా కార్యాలయ పనుల్లో బిజీగా ఉండటం వలన, విచారణ చేసే సమయం లేకపోవడంతో రాలేకపోయానని, వారం రోజుల్లో విచారణ చేపడతానని ఫోన్‌లో తెలిపారు.

నిజాలు నిగ్గుతేలేనా..?

కోట్లాది రూపాయల మ్యుటేషన్ స్కాంలో కమిషనర్‌ను విచారణాధికారిగా నియమిస్తే విచారణలో పారదర్శకత కొరవడుతుందని కార్యాలయవర్గాలే పేర్కొంటున్నాయి. ఈ కుంభకోణంలో కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారి వరకు అందరూ పాత్రధారులే కావడంతో విచారణ ముందుకు సాగడం లేదని సమాచారం. నలుగురు కమిషనర్ల హయాంలో జరిగిన కుంభకోణంపై విచారణ పారదర్శకంగా సాగేనా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరోవైపు కోట్ల రూపాయల కుంభకోణాన్ని బట్టబయలు చేయాలని, ఆర్డీ స్థాయి అధికారి విచారణ చేస్తేనే కుంభకోణం ఏస్థాయిలో జరిగిందో బహిర్గతమవుతుందని టీడీపీ వర్గాలు కోరుతున్నాయి.

మున్సిపల్ మంత్రి, ఎమ్మెల్యే దృష్టిసారించాలి

ఒక్క ఏడాదిలోనే 143 మ్యుటేషన్లలో అవినీతి జరిగిందని మున్సిపల్ అధికారులు ధ్రువీకరిస్తే, వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019-23 మధ్యకాలంలో భారీస్థాయిలో మ్యుటేషన్లు చోటుచేసుకున్నాయని ఆరోపణలున్నాయి. కోట్లాది రూపాయల కుంభకోణంపై మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టి సారించాలని కూటమి నేతలు కోరుతున్నారు.



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధర్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు

రేపు పెనమలూరులో సీఎం పర్యటన

» ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

గంగూరు (కంకిపాడు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 20న పెనమలూరు నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటిస్తున్నట్టు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. పెనమలూరు మండలం గంగూరులో బుధవారం ఎస్పీ గంగాధర్, స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లతో కలిసి ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గంగూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. రైతు సేవాకేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని, అనంతరం రైస్ మిల్ పరిశీలన, ఈడుపుగల్లు బీసీ కాలనీలో రెవెన్యూ సదస్సులో పాల్గొని ప్రజలతో ముఖాముఖి మాట్లాడతారు. సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ గీతాంజలి శర్మ, రెవెన్యూ డివిజనల్ అధికారి షారోన్, డీఎస్పో పార్వతి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మావతి, తహసీల్దార్ గోపాలకృష్ణ, భవన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు రండి

» డిప్యూటీ సీఎంకు బుద్ధప్రసాద్ ఆహ్వానం



పవన్‌కు వివరిస్తున్న బుద్ధప్రసాద్

అవనిగడ్డ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ నెల 28, 29 తేదీల్లో విజయవాడలో జరగనున్న ప్రపంచ తెలుగు మహాసభలకు ముఖ్యఅతిథిగా రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. కోడూరు మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం సాగర సంగమాన్ని ఎకో టూరిజం ప్రాజెక్టు ద్వారా అభివృద్ధి చేయాలని, అవనిగడ్డ మండలంలోని ద్వీప గ్రామం పాత ఎడ్లంకకు కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యకతను పవన్ దృష్టికి తీసుకెళ్లారు. వరదల సమయంలో రేవు దాటేందుకు గ్రామస్థులు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. అవనిగడ్డలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన డాక్టర్ కోట శ్రీహరిరావు హత్య కేసు దర్యాప్తు గురించి ఆయనతో చర్చించారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం నిధులతో విస్తృత స్థాయిలో సీసీ రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసిన సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మండలి వెంకట్రామ్‌తో కలిసి పవన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు.



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీలు కేశినేని శివనాథ్ తదితరులు

స్వతంత్ర సోలార్ పంపులను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

» పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2019-2024 మధ్యలో నాటి ప్రభుత్వం 'ప్రధాన మంత్రి కుసుమ్ పథకం' కింద స్వతంత్ర సోలార్ పంపుల కోసం ఎటువంటి అభ్యర్థన చేయలేదని కేంద్ర విద్యుత్ నూతన పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ వెల్లడించారు. పార్లమెంట్‌లో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కుసుమ్ పథకంపై వివరాలు అడిగిన మీదట మంత్రి పై విధంగా సమాధానం ఇచ్చారు. ప్రధాన మంత్రి- కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహా భియాన్ (పిఎం-కుసుమ్) పథకంలోని భాగం-బి కింద స్వతంత్ర సోలార్ పంపుల కోసం ఎటువంటి అభ్యర్థన అందలేదని, ఎక్కడా వాటిని ప్రారంభించలేదని తెలిపారు. రైతుల అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థిస్తే పథకాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ పథకం కింద ఈ ఏడాది నవంబరు 30 నాటికి 12,32,327 స్వతంత్ర సోలార్ పంపులకు ఆమోదం ఇవ్వగా, ఇప్పటి వరకు 5,74,324 పంపులు మాత్రమే ప్రారంభమయ్యాయని తెలిపారు. సోలార్ పంపుల ప్రారంభానికి 24 నెలల గడువు ఇవ్వటం జరుగుతుందని, అవసరమైతే ఆయా సందర్భాలను బట్టి పొడిగించే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (ఫండ్) ద్వారా 1941 దరఖాస్తులు ఆమోదించగా, రూ.54.82 కోట్లు ఆర్థిక సహాయం అందించినట్టు మంత్రి వెల్లడించారు. ఈ పథకంలోని ప్లాన్-ఏ కింద వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని చేర్చడానికి ఈ ఏడాది సెప్టెంబరు 10న మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు.

కేంద్రమంత్రికి ఎంపీల శుభాకాంక్షలు

కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీలో బుధవారం ఈ మేరకు ఆయన తన సహచర టీడీపీ ఎంపీలతో కలిసి రామ్మోహన్ నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ భవనంలోని టీడీపీ కార్యాలయంలో రామ్మోహన్ నాయుడుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసిన రామ్మోహన్ నాయుడు ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ, విమానయాన రంగాన్ని రామ్మోహన్ పరుగులు పెట్టిస్తున్నారని ఆయన సేవలను కొనియాడారు. లావు శ్రీకృష్ణదేవరాయలు, కె.అప్పలనాయుడు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసుల రెడ్డి, మతుకుమిల్లి శ్రీధర్, బి.నాగరాజు, లక్ష్మీనారాయణ, బైరెడ్డి శబరి, దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, హరీష్ మాధుర్, తెన్నేటి కృష్ణ ప్రసాద్ బి.కె. పార్థసారథి, కనకమేడల రవీంద్ర రామ్మోహన్ నాయుడుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ధర్నాచౌక్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీ మేరకు వలంటీర్ వ్యవస్థను కొనసాగించి సీఎం చంద్రబాబు తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. వలంటీర్లకు న్యాయం చేయాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన 50 గంటల ఆత్మగౌరవ దీక్ష బుధవారం ముగిసింది. స్థానిక దాసరిభవన్ వద్ద జరిగిన దీక్షలో పాల్గొన్న వారికి నిమ్మరసం ఇచ్చి రామకృష్ణ విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వలంటీర్లపై మంత్రుల వ్యాఖ్యలను ఖండించారు. వలంటీర్లందరూ వైసీపీ కార్యకర్తలని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వలంటీర్ల పోరాటానికి మద్దతు ప్రకటించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

భవానీ దీక్షల విరమణలు
విజయవంతం చేయండి

» వివిధ శాఖల అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష

వన్‌టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈనెల 21 నుంచి జరగనున్న భవానీదీక్షల విరమణలను విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులకు సూచించారు. భవానీదీక్షల విరమణలకు సంబంధించి బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంబంధిత పోలీసు రెవెన్యూ, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. రోజుకు సుమారు లక్ష మంది భక్తులు వస్తారని, మొత్తంగా ఆరు లక్షల మంది భక్తులు వచ్చేందుకు అవకాశం ఉన్నందున ఎక్కడా పొరపాట్లు లేకుండా భక్తులకు మార్గదర్శనం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన డ్రోన్ సాంకేతికత, భక్తులకు వివిధ అంశాలు గురించి తెలియజేసే యాప్‌ను గురించి వివరించారు. సమీకృత కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మూడు షిఫ్ట్‌ల్లో అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. వివిధ ఏర్పాట్లు గురించి ఆయన వివరించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రాజీవ్ గాంధీపార్క్, పున్నమిఘాట్, భవానీఘాట్, బబ్బూరి గ్రౌండ్, కుమ్మరిపాలెంలోని టీటీడీ స్థలం, సితార సెంటర్, పున్నమిఘాట్ లోటస్ పక్కన, బీఆర్టీఎస్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. 20 లక్షల లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. దుర్గగుడి టోల్‌గేట్ నుంచి మొత్తం 26 పాయింట్లలో మైక్ ప్రసారం ద్వారా సూచనలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు ఉపయోగపడేలా సూచనల బోర్డులను సిద్ధం చేస్తున్నామన్నారు. మహిళా భక్తులు వస్త్రాలు మార్చుకునేందుకు సీతమ్మవారి పాదాల వద్ద 10, పున్నమీ ఘాట్ వద్ద 2, భవానీ ఘాట్ వద్ద 2 తాత్కాలిక గదులను అందుబాటులో ఉంచారన్నారు. 20 వైద్య శిబిరాలను సిద్ధం చేసినట్టు తెలిపారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ఆశాఖ అధికారులు చర్యలు తీసకోవాలన్నారు. ఘాట్లలో స్విమ్మర్లు, బోట్లు, లైఫ్ జాకెట్లను అందుబాటులో ఉంచాలని, మత్స్యశాఖ అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శాంతి భద్రతలు, నిఘా, పార్కింగ్, తదితరాల పై పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు వివరించారు. ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు, డీసీపీ గౌతమీ శాలి, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహ, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, హాజరైన వివిధ శాఖల అధికారులు

హౌస్‌హోల్డ్ సర్వే
పూర్తి చేయండి

» పౌరుల మిస్సింగ్ డేటా నమోదు చేయాలి : కలెక్టర్

కృష్ణలంక, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపట్టిన హౌస్ హోల్డ్ సర్వేను వారం రోజుల్లో పూర్తిచేసి పౌరుల మిస్సింగ్ డేటాను గృహ డేటాబేస్‌లో చేర్చాలని, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది హాజరును తప్పక నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్వహిస్తున్న హౌస్ హోల్డ్ సర్వే ప్రగతిపై బుధవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ మండల అభివృద్ధి, గ్రామ, వార్డు సచివాలయ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి పౌరునికి సంబంధించిన సమగ్ర సమాచారం గృహ డేటాబేస్‌లో పొందుపరిచేందుకు హౌస్ హోల్డ్ సర్వేను నిర్వహించడం జరుగుతుందన్నారు. దారిద్యరేఖకు దిగువన వున్న వారు సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్న వారు డేటాబేస్‌లో నమోదు చేయబడ్డారని, ఉద్యోగస్తులు, వ్యాపారరంగానికి చెందిన వారు, దారిద్ర్యరేఖకు పైబడినవారు సంక్షేమ పథకాలకు అర్హులంకామనే ఉద్దేశ్యంతో వారి వివరాలను మ్యాపింగ్ చేసుకోలేదన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది వారి పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ యజమానితో పాటు సభ్యుల వివరాలను సేకరించి నమోదుకాని వారి డేటాను పొందుపరచాలన్నారు. ప్రతి ఇంటికి జియో కో-ఆర్డినేటర్ల అవసరం వుందని పౌరులకు సేవలందించేందుకు జియో టాగింగ్ తప్పనిసరని జిల్లాలో 7,28,383 గృహాలకుగాను 6,91,627 గృహాలు జియో టాగింగ్ చేయడం జరిగిందన్నారు. మిగిలిన 36,756 గృహాలకు జియోటాగింగ్ చేయాలన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు సామాజిక ప్రయోజనాలను అందించేలా వారి ఆధార్‌ను బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ప్రతిరోజు తప్పనిసరిగా హాజరు నమోదు చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారిణి జి.జ్యోతి, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య నిరసన

» రెండో వివాహం చేసుకున్నాడని అనుమానం

బోయిన్‌పల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉంటూ 4 సంవత్సరాల నుంచి కనిపించకుండా తప్పించుకు తిరుగుతున్న భర్త తనతో కాపురం చేయాలంటూ ఓ మహిళ భర్త ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేసిన సంఘటన మారేడుపల్లిలో చోటుచేసుకుంది. ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం రంగాపురం గ్రామానికి చెందిన నవ్య బుధవారం భర్త ఇంటి ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేసింది. వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ పికెట్ విజయనగర్‌కాలనీకి చెందిన ఉదయ్ భాస్కర్ రెడ్డితో నవ్యకు 2017లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో 30తులాల బంగారం, రూ.10 లక్షలు ఇచ్చి వైభవంగా తల్లితండ్రులు వివాహం జరిపించినట్టు తెలిపింది. వివాహం అనంతరం అమెరికాలో సంవత్సరంన్నర కాపురం చేశామని, ఈ సమయంలో ఆయన తనతో ఉండకుండా ఎక్కువ సమయం అక్క తరంగిణిరెడ్డితోనే ఉండేవాడని, ఇదేంటి అని ప్రశ్నించినప్పుడల్లా తనను చిత్రహింసలు పెట్టేవాడని తెలిపింది. నిత్యం అనుమానిస్తూ వేధించేవారని, అసభ్యకరంగా వీడియోలు తీస్తూ అక్క, తమ్ముడు వేధించేవాళ్లని, దీంతో తల్లిదండ్రులకు విషయం తెలిపి ఇండియాకు వచ్చి వెస్ట్ మారేడుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టినట్టు తెలిపింది. వివాహ సమయంలో తీసుకున్న బంగారం, నగదు కాకుండా తాను అమెరికాలో ఉన్న సమయంలో ఉద్యోగం చేసి కూడపెట్టుకున్న సుమారు 20లక్షలతో బంగారం చేయించుకుంటే ఆ బంగారాన్ని సైతం వారివద్దనే ఉంచుకొని అమెరికా నుంచి వెల్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేసింది. తాను చదువుకున్న సర్టిఫికెట్లను సంవత్సరాలు తరబడి వారి వద్దనే ఉంచుకొని గత మూడు నెలల క్రితం ఇచ్చారని దీంతో తాను ఎంతో ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా జీవితాన్ని నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త ఉదయ్‌కుమార్ రెడ్డి రెండో వివాహం చేసుకొని వేరే కాపురం చేస్తున్నాడని అనుమానాలు ఉన్నాయని తెలిపింది. న్యాయం కోరుతూ బుధవారం భర్త ఇంటి ఎదుట ఆందోళన చేస్తుంటే రాత్రికి రాత్రి కోర్టు నుంచి ఆర్డర్ తీసుకురావడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేసింది. వెస్ట్ మారేడుపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆమెను స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. తన భర్తను కాపురం చేసేవిధంగా చర్యలు తీసుకోకపోతే నిరసన విరమించే ప్రసక్తేలేదని పోలీసులకు తేల్చి చెప్పింది. దీంతో మారేడుపల్లిలోని నవ్య అత్తగారి ఇంటి వద్ద నవ్యను చూసిన స్థానిక మహిళలు కొందరు ఓదార్చే ప్రయత్నం చేశారు.

హైకోర్టు న్యాయవాది పదిరి రవితేజ్‌కు అమెరికా వాణిజ్య సదస్సు ఆహ్వానం

వన్‌టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమెరికా - భారత దేశాల మధ్య జనవరి 23వ తేదీన జరిగే వాణిజ్యం - అవకాశాల సదస్సులో పాల్గొనేందుకు హైకోర్టు న్యాయవాది పదిరి రవితేజకు ఆహ్వానం అందింది. ఎకనామిస్ట్ ఇంపాక్ట్ తరఫున తారాబ్రౌన్ ఆహ్వానాన్ని రవితేజకు అందజేశారు. ట్రంప్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత భారతదేశంలో అమెరికా సంబంధాలు ఎలా ఉంటాయనే అంశంపై సదస్సులో చర్చ జరగనుంది. అమెరికాలో తగినంత పారిశ్రామిక ఉత్పత్తులు చేసే అవకాశాలు ఉన్నాయా? వాణిజ్య ఒప్పందాలు, వాటి ప్రభావం, తదితర అంశాలపై చర్చ జరగనున్నాయి. దేశంలో యువకుల సంఖ్య ఆధారంగా జరిగే అభివృద్ధిపై అమెరికాతో దౌత్య సంబంధాలు, ఇండో పసిఫిక్ ప్రాంతాల్లో అంతర్జాతీయ రాజకీయాల ప్రభావం, అనిశ్చితి, తదితర అంశాలపై చర్చ ఉంటుందని ఆహ్వాన పత్రికలో తెలియజేశారు.

కాంగ్రెస్ నేతల అరెస్టు, విడుదల

వన్‌టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లంచం వ్యవహారంలో అదానీపై ఎన్ని ఆరోపణలు వచ్చినా కేంద్రం చర్యలు తీసుకోకపోవటంపై నిరసనగా బుధవారం దేశవ్యాప్తంగా 'చలో రాజ్‌భవన్' కార్యక్రమానికి ఆలిండియా కాంగ్రెస్ పార్టీ పిలుపు నిచ్చింది. దీనిలో భాగంగా విజయవాడలో కాంగ్రెస్ నాయకులు కార్యక్రమానికి ఉపక్రమిస్తుండగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. సౌత్ ఏసీపీ యు.బంగార్రాజు ఆధ్వర్యంలో గవర్నర్‌పేట సీఐ నాగ మురళి, ఎస్ఐలు సిబ్బందితో నాయకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి సాయంత్రంవిడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీసాల రాజేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు కొలనుకొండ శివాజీతో సహా 12 మంది కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పాలకాయితిప్ప బీచ్ గేట్లు మూసివేత

కోడూరు : పాలకాయితిప్ప బీచ్ గేట్లను ఫారెస్టు అధికారులు బుధవారం మూసివేశారు. వాతావరణంలో మార్పుల కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున బీచ్ వద్దకు యాత్రికులను అనుమతించటం లేదని, ఈ మేరకు పాలకాయితిప్ప వద్ద బీచ్‌గేట్లు మూసివేసినట్టు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చిన తర్వాత గేట్లు తెరుస్తామని తెలిపారు.యాత్రికులు గమనించాలని కోరారు.


21న పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా

భారతీనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కల్పనశాఖ, డీఆర్డీఏ సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు ఒకేషనల్ ఉపాధి కల్పన అధికారి వై.సత్యబ్రహ్మం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, దొడ్ల డైరీ లిమిటెడ్, కోస్టల్ న్యూమటిక్ ఏజెన్సీస్, రమాక్లాత్ స్టోర్స్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 18 నుంచి 30సంవత్సరాల వయస్సులోపు వారు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూ ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికయిన వారికి నెలకు రూ.12,000 నుంచి రూ.35000 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. వివరాలకు 9391254464, 9347779032 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

తెలంగాణ మంత్రి వ్యాఖ్యలపై ఖండన

నందిగామ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు జాతి ఆరాధ్య దైవం.. నందమూరి తారకరామారావు స్మృతి చిహ్నం సమీపంలో అసెంబ్లీ కడతామని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం బుధవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. అసంబద్ధ వ్యాఖ్యలు చేసి తెలుగు వారి ఆగ్రహానికి గురికావద్దని సంఘం ఉపాధ్యక్షుడు వడ్డెల్లి సాంబశివరావు, జిల్లా దిశ కమిటీ సభ్యురాలు మన్నే కళావతి, నాయకులు హెచ్చరించారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి



గుడివాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని రామవరప్పాడు-నిడమానూరు స్టేషన్ల మధ్యలో విజయవాడ రూరల్ కార్మికనగర్-ప్రసాదంపాడు పంచాయతీ పరిధిలో గుర్తు తెలియని రైలు ఢీకొని సుమారు 65 సంవత్సరాల వయసున్న వృద్ధురాలు మృతి చెందినట్టు రైల్వే ఎస్ఐ మహబూబ్ షరీఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె వివరాలు తెలిసిన వారు స్టేషన్ ఎస్ఐ సెల్ 94406 27570కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రైలు ఢీకొని యువకుడు మృతి

» రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన మృతుడి స్నేహితులు

» అనుమానాస్పద మృతిగా కేసు

అజిత్‌సింగ్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులందరూ కలిసి రైల్వే ట్రాక్ పక్కన పార్టీ చేసుకున్నారు. అనుకోకుండా ఓ యువకుడిని గూడ్స్ రైలు బలంగా ఢీకొట్టింది. కొనఊపిరితో ఉన్న యువకుడిని స్నేహితులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే ఈ విషయాన్ని దాచిపెట్టి మృతుడి స్నేహితులు రోడ్డు ప్రమాదంగా చిత్రించి పోలీసులను, యువకుడి కుటుంబ సభ్యులను నమ్మించే ప్రయత్నం చేశారు. పోలీసుల విచారణలో అసలు విషయం వెలుగుచూసింది. దేవీనగర్ రైల్వే ట్రాక్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. దేవీనగర్ ప్రాంతానికి చెందిన జి.అజయ్‌కుమార్(19) ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి నలుగురు స్నేహితులతో కలిసి పార్టీ చేసుకునేందుకు సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లారు. సుమారు రాత్రి 10 గంటల సమయంలో అజయ్‌కుమార్ మూత్ర విసర్జనకు రైలు పట్టాల పక్కకు వెళ్లాడు. అదే సమయంలో అటుగా వస్తున్న గూడ్స్ రైలు అజయ్‌కుమార్‌ను ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన అతడ్ని స్నేహితులు ప్రభుత్వాసుపత్రికి తరలిచారు.

రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ..

అజయ్‌కుమార్‌ను ఆసుపత్రిలో చేర్పిన స్నేహితులు అక్కడ రోడ్డు ప్రమాదంలో గాయపడినట్టుగా చెప్పడంతో చికిత్స చేసిన వైద్యులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రైలు ప్రమాదాన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రించేందుకు మృతుడి మోటారు సైకిల్‌ను పగలకొట్టి బైక్‌పై నుంచి పడిపోయినట్టు పోలీసులకు స్నేహితులు కథ అల్లారు. అయితే ఘటనా స్థలాన్ని పరిశీలించగా అక్కడ రోడ్డు ప్రమాదం జరిగినట్టు ఎటువంటి ఆధారం పోలీసులకు లభించలేదు. దీంతో గట్టిగా నిలదీయడంతో అసలు విషయాన్ని చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు కేసును రైల్వే పోలీసులకు అప్పగించారు. రోడ్డు ప్రమాదంగా చిత్రించే ప్రయత్నంపైనా.. పార్టీ విషయం బయటకు తెలుస్తుందనే భయంతోనా.. లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



స్నేహితులు పగల కొట్టిన ద్విచక్రవాహనం, అజయ్ (ఫైల్)



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103,111, 122
చికెన్ విత్ స్కిన్	192
చికెన్ స్కిన్‌లెస్	202

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 610

బయోగ్యాస్ ప్లాంట్‌లో సెర్ప్ సీఈవో



పెనమలూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెనమలూరులో గ్రామ సంఘంలోని వినీల పొదుపు సంఘం సభ్యురాలు మోర్ల శివకోటికి ప్రభుత్వం ఇచ్చిన నలభైవేల విలువైన బయోగ్యాస్ ప్లాంట్‌ను సెర్ప్ సీఈవో జీ వీరపాండ్యన్ బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంపద నుంచి వచ్చే పేడ ద్వారా ప్రతిరోజు ఉచితంగా ఎల్పీజీ గ్యాస్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో కన్నం నాయుడు, ఎంపీడీవో ప్రణవి, వెలుగు ఏపీఎం కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

గన్నవరం తహసీల్దార్ కేవీ శివయ్య

గన్నవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని కేవీ శివయ్య అన్నారు. మండలంలోని సూరంపల్లిలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ కేవీ శివయ్య మాట్లాడుతూ రైతులు రెవెన్యూ కార్యాలయానికి రాకుండానే గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి భూసమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం రైతుల వద్దకే అధికారులను పంపించిందన్నారు. చాలా కాలంగా భూములు సాగుచేస్తూ వారసత్వంగా సంక్రమించిన పొలాలకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేయాలని రైతులు కోరారు. అడంగల్ కరక్షన్స్ భూ సంబంధిత సమస్యలు, సర్వే కొలతల్లో తేడాలు కోసం 25అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. అర్జీలను పరిశీలించి తగిన చర్యలు చేపడతామన్నారు. సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాసరావు, రామినీడు బసవపూర్ణయ్య, వీఆర్వో శ్రీరామకుమార్ పాల్గొన్నారు.



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కేవీ శివయ్య

కాటూరు సదస్సులో 18 అర్జీలు

ఉయ్యూరు: భూసంబంధిత, ఇరత సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సురేశ్‌కుమార్ తెలిపారు. కాటూరులో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన సదస్సుల ఉద్దేశాన్ని ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా పట్టాదారు పాసుపుస్తకాలకు 13, సర్వే నిమిత్తం 5 దరఖాస్తులు స్వీకరించారు. ఎంపీడీవో శేషగిరిరావు, సర్వేయర్ సురేశ్, ఆర్ఐ యతేంద్రియులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలోని నందమూరు, మదిరపాడు గ్రామాల్లో రెవెన్యూ ఇతర అనుబంధశాఖల ఆధ్వర్యంలో బుధవారం మీభూమి- మీహక్కు రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. తహసీల్దార్ జాలాది విమల కుమారి మాట్లాడుతూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల తోపాటు సబ్‌డివిజన్, మ్యుటేషన్‌పై రెండుగ్రామాల పరిధిలో అర్జీలు స్వీకరించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి, నందమూరు, మదిరపాడు సర్పంచ్‌లు తులిమిల్లి బేబి, తుమ్మల రామారావు, ఆర్ఐ బి.సూర్యకాంతి, వీఆర్వో ఏ.శివాజీ రవీంద్రబాబు, గ్రామసర్వేయర్ మన్మోహన్‌దత్తా, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



లంకపల్లి అగ్రహారం నుంచి ఇరుముడులతో శబరిమల బయలుదేరి వెళ్తున్న అయ్యప్ప మాలధారులు



అయ్యప్ప భక్తుల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న ఉయ్యూరు మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప భక్తుల ఇరుముడులు

ఉంగుటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లంకపల్లి అగ్రహారంలో కొలువైవున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అయ్యప్ప మాలధారుల కుటుంబసభ్యులు, బంధువులతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఆలయ అర్చకులు చదలవాడ శివనాగేశ్వరరావు, సత్యనారాయణ గురుస్వామి సంయుక్తంగా స్వామివారికి విశేషపూజలు జరిపి, భక్తిశ్రద్ధలతో ఇరుముడి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 25మంది అయ్యప్ప మాలాధారులచేత సత్యనారాయణ గురుస్వామి ఇరుముడులు కట్టారు. అనంతరం అయ్యప్ప దీక్షాధారులందరూ తలపై ఇరుముడులు పెట్టుకుని పేటైతుళ్లి అనే కేరళ సాంప్రదాయ గిరిజన నృత్యంచేస్తూ గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వాములు ఏర్పాటు చేసిన తీర్థప్రసాదాలను భక్తులందరూ స్వీకరించారు. దేవాలయం వద్దనుంచి ఇరుముడులతో అయ్యప్ప దీక్షాధారులు శబరిమల యాత్రక తరలి వెళ్లారు.

ఉయ్యూరు: శ్రీజగందాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప మాలధారుల ఇరుముడుల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సగరసాధికార రాష్ట్ర కన్వీనర్ జంపన వీర శ్రీనివాస్, వీరంకి రాముతో అయ్యప్పమాల ధరించిన వారు ఇరుముడులు కట్టుకుని శబరిమలకు బయలుదేరి వెళ్లారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఉయ్యూరు మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు పలువురు ప్రముఖులు ఇరుముడుల కార్యక్రమానికి హాజరు కాగా శాలువాలతో సత్కరించారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ నోడల్ అధికారి పి. భానుమతి

బాల్య వివాహాలపై అవగాహన అవసరం

కంకిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల వచ్చే సమస్యలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ ప్రాజెక్టు నోడల్ అధికారి పి. భానుమతి అన్నారు. కంకిపాడులోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం కిషోర వికాసం మండల స్థాయి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భానుమతి మాట్లాడుతూ యుక్త వయస్సులో వచ్చే సమస్యలు, బాల్యవివాహల వల్లే కలిగే ఇబ్బందులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న సంగతులు వివరించారు. బాల్య వివాహలు జరగకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, డీసీ పీవో సుకన్య, సూపర్‌వైజరు అన్నామణి పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నాగమల్లేశ్వరి

లింగ వివక్షను దరిచేరనీయొద్దు

● జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సమాజంతో పాటు కుటుంబంలో కూడా స్త్రీ, పురుష వ్యత్యాసం ఉండకూడదని, విద్యార్థి దశ నుంచే సమానత్వం పాటించేలా చేయగలిగితే భావితరాల్లో లింగ వివక్ష దరిచేరదని అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నాగమల్లేశ్వరి అన్నారు. కానుమోలు, ఆరుగొలను హైస్కూల్ హెచ్‌ఎంల పర్యవేక్షణలో విద్యార్థులకు జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో కూడిన జీవితం అలవరచుకోవాలని సూచించారు. సమాజంలో లింగ వివక్షను ఎలా ఎదుర్కోవాలో విద్యార్థులకు వివరించి వారితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, హర్ష, లక్ష్మి, రమణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినికి మానవత ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్: పిడుగురాళ్లలో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న అప్పనవీడు గ్రామానికి చెందిన మహమ్మద్ యాస్మిన్‌కు హనుమాన్ జంక్షన్ శాఖ రూ.7500లు ఆర్థిక సాయం అందించింది. బుధవారం స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో విద్యార్థినికి ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరావు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మానవత సభ్యులు జి.జయరామచంద్రరావు, ఇందిరాదేవి, సూర్యనారాయణ, రావ చంద్ర రావు, సుబ్బారావు,శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ఎస్సై సందీప్‌కు డీజీపీ అభినందనలు

కంకిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించటంలో చొరవ చూపించిన కంకిపాడు ఎస్సై డి. సందీప్‌ను రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమల రావు అభినందించారు. లోక్ అదాలత్‌లో జిల్లాలోనే అత్యధిక కేసులను పరిష్కారం అయ్యాయని సీఐ మురళీకృష్ణ సహకారంతో కేసులు పరిష్కరించటంలో సందీప్ విశేష కృషి చేశారని జిల్లా ఎస్పీ గంగాధర్ ఎస్సై సందీప్‌ను అభినందించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేయిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

గన్నవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణాన్ని పరిశు భ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు చేపట్టినట్లు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దేవినేని సులోచన రాణి, బుస్సే నాగ ప్రసాద్ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్పిటల్‌కు ఈశాన్యం ఉన్న గేట్లను కూడా తెరిపించి ఆ పరిసరాలను శుభ్రం చేయిస్తున్నామన్నారు. గేటు బయట ఉన్న ఆక్రమణలను కూడా తొలగించారన్నారు. హాస్పిటల్‌కు వచ్చి వెళ్లేందుకు రెండుగేట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా, ఆస్పత్రి ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టామన్నారు.

షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న కమిటీ సభ్యులు

ఉయ్యూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గండిగుంట బైపాస్ రోడ్డు షిర్డీ సాయిబాబా మందిరం 21వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. మందిరం కమిటీ సభ్యులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా బాబాకు అభిషేకాలు, పూజలు చేశారు. పలువురు భక్తులు ఈకార్యక్రమంలో పా ల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలి



ఆహ్వానపత్రికలు అందజేస్తున్న శ్రీనివాసరావు, శాంతమ్మ తదితరులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల ప్రక్షాళనే ధ్యేయంగా నిర్వహిస్తున్న హైందవ శంఖారావం జయప్రదం చేయాలని కార్యవాహక ఎదురువాడ శ్రీనివాసరావు తెలిపారు. మడిచర్ల, కొత్తపల్లి, కొయ్యూరు గ్రామాల్లో బుధవారం ఇంటింటికీ హైందవ శంఖారావం ఆహ్వాన పత్రికలను అందజేశారు. జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు పిలుపునిచ్చారు. సర్పంచ్ అజ్మీరా శాంతమ్మ, కృష్ణ నాయక్, కొల్లి ప్రసాద్, దరావత్ సోములు, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాసాగర్‌కు పూర్తి మద్దతు



మాట్లాడుతున్న ఉండి వెంకట పురుషోత్తమ రాజు

కంకిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎ. విద్యాసాగర్‌కు కంకిపాడు యూనిట్ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని కంకిపాడు ఎన్జీవోస్ యూనిట్ అధ్యక్షుడు ఉండి వెంకట పురుషోత్తమ రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం యూనిట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారంలో విద్యాసాగర్ విశేష కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు సురేష్, ట్రెజరర్ మురళీకృష్ణ, మహిళ కార్యదర్శి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య



ఉయ్యూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గండిగుంట పంచాయతీ పరిధి వెంకటాపురంలో పదవ తరగతి చదువుతున్న పోలన గీత మాధురి(15) ఆత్మహత్య చేసుకుంది. ఉయ్యూరు పట్టణ ఎస్సై విశ్వనాథ్ వివరాల ప్రకారం వెంకటాపురంలో నివసించే పోలన శ్రీనివాసరావు కుమార్తె గీతమాధురి ఆకునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతుంది. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భోజనానికి పాఠశాల నుంచి వచ్చిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంటగదిలో చీరతో ఉరివేసుకుని మృతి చెందింది. మృతురాలి తల్లి విజయవాడలో వస్త్రదుకాణంలో పనిచేసేందుకు వెళ్లగా, తండ్రి కూలి పనికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన ఆయనకు కుమార్తె ఉరికి వేలాడుతూ కన్పించింది, చుట్టుపక్కల వారి సాయంతో కిందకు దించగా అప్పటికే మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆదిత్య బధిరలో సెమీ క్రిస్మస్ వేడుక



హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య బధిర విద్యాలయంలో బుధ వారం సెమీక్రిస్మస్ వేడుక లను ఘనంగా నిర్వహిం చారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ, కరస్పాండెంట్ ఇమంది అన్నపూర్ణ విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.విద్యార్థులకు బహుమతులు అందించారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్‌లో అనురాధరెడ్డికి బంగారం



అనురాధరెడ్డిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

పెనమలూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య కళాశాల సరస్వతి సౌధమ్ విద్యార్థిని పిట్టు అనురాధరెడ్డి జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో బంగారు పతకం సాధించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎగ్జిక్యూటివ్ డీన్ గుంటూరు హరిబాబు తెలిపారు. గతంలో అనురాధరెడ్డి రాష్ట్ర స్థాయి సైక్లింగ్, కత్తిసాము పోటీల్లో బంగారు పతకాలు సాధించినట్లు డీన్ తెలిపారు. అనురాధరెడ్డిని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ, ఏజీఎం బీ. శ్రీనివాసరావు, అసోసియేట్ డీన్ కొమ్మాలపాటి శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కూటమి కృషి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పక్కన మాజీ వైస్ ఎంపీపీ కోయా

గంగూరు (కంకిపాడు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని ఏఆర్ నగర్‌లో రూ. 15 లక్షలతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులను బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో రహదారులు, డ్రెయిన్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కోయా ఆనంద్ ప్రసాద్, తాడిగడప మున్సిపాలిటి అధ్యక్షుడు అనుమోలు ప్రభాకర్, హనుమాన్, అబ్దుల్ గౌస్, అక్బర్ బాషా, ఇర్ఫాన్, సలాం, పల్లె సందీప్, కొక్కిలిగడ్డ బుజ్జి, బంగారు నాగేంద్ర పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు ఉయ్యూరు విద్యార్థినుల ఎంపిక



విజేతలతో కళాశాల సిబ్బంది

ఉయ్యూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ దుర్గామల్లేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన కృష్ణా విశ్వ విద్యాలయ అంతర్ కళాశాలల మహిళా వాలీబాల్ పోటీల్లో ఏజీఅండ్ఎస్‌జీఎస్ కళాశాల విద్యార్థినులు ద్వితీయస్థానం సాధించగా అందులో ఇద్దరు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ మాట్లాడుతూ కళాశాల టీమ్‌లోని జె.జయ, జె.సుధారాణి జనవరి 5నుంచి 9వరకు కేరళలోని కాలికట్ యూనివర్సిటీలో నిర్వహించనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీల్లో కృష్ణా విశ్వవిద్యాలయం తరఫున పాల్గొంటారని తెలిపారు. అంతర్‌కళాశాలల పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థినులు, ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన ఇద్దరిని ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ పి.చంద్రబాబు అభినందించారు.

వేంపాడు, చాగంటిపాడు గ్రామాలకు బస్సు సౌకర్యం



మాట్లాడుతున్న కూటమి నేతలు

ఉంగుటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వేంపాడు, చాగంటిపాడు గ్రామాల ప్రజల చిరకాల వాంఛ ఎట్టకేలకు నెరవేరింది. సదరు గ్రామాల నుంచి నిత్యం వివిధ పనులపై గన్నవరం, ఉయ్యూరుకు వెళ్లాలంటే ప్రజలు ఆటోలపై ఆధారపడాల్సి వస్తోందని ఆయా గ్రామాల కూటమి నాయకులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి ఆర్టీసీ బస్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే చొరవతో తమ గ్రామాలకు బస్ రావడంపై ఆయాగ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ యార్లగడ్డకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన 242 సర్వీస్ నెంబర్ బస్ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం గన్నవరం నుంచి వయా కేసరపల్లి, అజ్జంపూడి, బుద్ధవరం, బూతిమిల్లిపాడు, తరిగొప్పల, వేంపాడు, చాగంటిపాడు, ఇందుపల్లి, నందమూరు, కలవపాముల, కాటూరు మీదుగా ఉయ్యూరుకు రాకపోకలు సాగిస్తుందని తెలిపారు. సర్పంచ్‌లు శివనాగబాబు, లక్ష్మీఅనూష, జనసేన మండల అధ్యక్షుడు బర్మా భాస్కరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షులు కొలుసు రవీంద్రబాబు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

అసోసియేషన్ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

గన్నవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ మండల అధ్యక్షుడు మీరంపల్లి పూర్ణచంద్రరావు అన్నారు. గన్నవరం మండల గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం(వీఆర్ఏ) అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పని భారం తగ్గించాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగులుగా పేస్కేల్ అమలు చేయాలన్నారు. నైట్‌వాచ్‌మన్, అటెండర్ డ్యూటీలను వీఆర్‌ఏలకు ఇవ్వకూడదన్నారు. నామినీలను రెగ్యులర్ వీఆర్‌ఏలుగా చేయాలని చెప్పారు. ప్రమోషన్స్‌లో వీఆర్‌ఏలకు 70 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ శివయ్యకు అందజేశారు.

నూతన కమిటీ ఇదే..

వీఆర్‌ఏల అసోసియేషన్ మండల అధ్యక్ష కార్యదర్శులుగా మిరంపల్లి పూర్ణచంద్రరావు, గుండాల రామకృష్ణ, ఉపాధ్యక్షులు మేడూరి జోషిన్, కోశాధికారిగా దూది అనూష, సలహాదారులుగా పులపాక ప్రసన్నరావు, సత్తెనపల్లి సుజాత, సభ్యులుగా ముచ్చింతల గీత, చిక్కవరపు శ్రీనివాసరావు, మాతంగి ఝాన్సీరాణి, కందుల సుబ్బారావులతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటరత్నం తదితరులు అభినందించారు.

మల్లవల్లిలో 'పొలం పిలుస్తోంది'



హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మల్లవల్లిలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ అధికారి భవాని పశుసంవర్ధకశాఖ అధికారి రామకృష్ణతో కలిసి మొక్కజొన్న పంటను పరిశీలించి పశుపోషణపై అవగాహన కల్పించారు. మొక్కజొన్న పంటలో ఎండుతెగులు రాకుండా తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను వివరించారు. ఉపాధిహామీ నిధుల ద్వారా వ్యక్తిగతంగా 50సెంట్ల వరకు పశుగ్రాసం సాగుకు ప్రభుత్వం సహకారం అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ సూచించారు. పశుగణన సర్వేకు సహకరించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో అక్కినేని కృష్ణాజీ, రైతులు, వీహెచ్ఎ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు నోటీసులు



హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జంక్షన్‌లో పాదచారులు, వాహనచోదకులకు ఇబ్బందిగా మారిన ఫుట్‌పాత్, రోడ్డు మార్జిన్ ఆక్రమణలపై బాపులపాడు గ్రామ పంచాయతీ దృష్టి సారించింది. ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించకపోతే పోలీసుల సహకారంతో ఆక్రమణలను తొలగించడానికి గురువారం నుంచి చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరి హెచ్చరించారు. వారం రోజుల కిందట అన్ని దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. గత రెండు రోజులు పాటు మైక్ ద్వారా విస్తృతంగా ప్రచారం కూడా చేశారు. గ్రామం పరిధిలోని విజయవాడ, గుడివాడ, నూజివీడు రోడ్లలో దుకాణాలు ముందు రోడ్డుమార్జిన్, ఫుట్‌పాత్ ఆక్రమణకు గురికావడంతో ఆటోలు, తోపుడు బండ్లు మీద వ్యాపారాలు సాగించే వారితో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ సమస్య కూడా ఎదురవుతోంది. ఆక్రమణలను తొలగించడానికి గ్రామ పంచాయతీ దుకాణాదారులకు నోటీసులు జారీ చేసినా ఇంత వరకు స్వచ్ఛందంగా ఎవరు ముందుకు రాకపోవడంతో తొలగింపు చర్యలు చేపట్టనున్నట్లు కార్యదర్శి పూర్ణేశ్వరి పూనుకున్నారు.



రెండు బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్

పెనమలూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మునిసిపాలిటీలో 2023-25 సంవత్సరానికి మూడో విడత లైసెన్సు ఫీజు చెల్లించి రెన్యువల్ చేయించుకోవడంలో విఫలమయిన రెండు బార్ల ఈ-వేలానికి దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎక్సైజ్ సీఐ శేషగిరిరావు తెలిపారు. దరఖాస్తుదారులు ఈ నెల 22 వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లోనే దరఖాస్తును 23లోగా సమర్పించాలన్నారు. 24న జిల్లా కలెక్టర్ సమక్షంలో లాట్ల డ్రా తీసి బార్లను కేటాయిస్తారన్నారు. తాడిగడప మునిసిపాలిటీలో ఏర్పాటు చేయదలచిన రెండు బార్లకు లైసెన్సు ఫీజులను రూ.78,26,250, రూ.76,72,250 నిర్ణయించినట్లు సీఐ తెలిపారు.

21న ఫెన్సింగ్ రాష్ట్ర పోటీలకు ఏర్పాట్లు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం డీఎస్ఏ హాల్లో రాష్ట్ర ఫెన్సింగ్ సీనియర్ పురుషులు, మహిళా ఛాంపియన్‌షిప్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రాష్ట్ర అసోసియేషన్ సెక్రటరీ జీఎస్‌వీ కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జిల్లా టీమ్‌ల ఎంపికలకు సరిపడా ఎలక్ట్రానిక్ పరికరాలు లేనందున, ఫెన్సింగ్ క్రీడాకారులను మాన్యువల్ విధానంలో ఎంపికల్లో ఆరోపణల వస్తున్నాయని, దీని వలన నిజమైన క్రీడాకారులందరూ తమ ప్రతిభను నిరూపించుకోవడానికి సమాన అవకాశాల కోసం పొరుగు రాష్ట్రం నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలను తెప్పించామన్నారు. నిజమైన ఫెన్సింగ్ ప్లేయర్లు తమ ఎంట్రీలను గూగుల్ షీట్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. 21న ఉదయం 8 గంటల్లోగా పంపాలని, ఇతర వివరాలకు 9676352682,955352888 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి కృష్ణా రీజియన్ పాలిటెక్నిక్ స్పోర్ట్సు, గేమ్స్‌మీట్

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్స్‌లో ఈనెల 20, 21న కృష్ణా రీజియన్ పాలిటెక్నిక్ కళాశాలల బాలబాలికల స్పోర్ట్సు, గేమ్స్ మీట్‌కు ఏర్పాట్లు చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్, మీట్ కన్వీనర్ డాక్టర్ ఎం పార్థసారథి తెలిపారు. రీజియన్‌లో మొత్తం 23 కళాశాలల నుంచి 6 స్పోర్ట్సు, 14 గేమ్స్‌ల్లో మొత్తం 650 మంది క్రీడాకారులు తలపడుతున్నారన్నారు. పోటీలను ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నారు.

భవానీల దీక్ష విరమణకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ
- సీపీ, ఈవోతో కలిసి పరిశీలన



భవానీల దీక్ష విరమణ ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళుతున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, సీపీ రాజశేఖర్ బాబు, ఈవో రామారావు, వివిధ విభాగాల అధికారులు

వన్‌టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఈనెల 21 నుంచి నిర్వహించనున్న భవానీ దీక్షల విరమణలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, అమ్మవారి దర్శనం శీఘ్రంగా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, దేవస్థానం ఈవో కేఎస్ రామారావు, ఇతర అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయి పర్యటచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 25 వరకు దీక్షాదారులు ఇరుముడులు సమర్పించి దీక్షలు విరమణ చేయనున్నారన్నారు. సుమారు 6 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నామని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించామన్నారు. విధి నిర్వహణలో అలక్ష్యం లేకుండా భక్తులకు శీఘ్రతరంగా దర్శనం అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్యూలైన్లలో వాటర్ ప్రూఫ్ షామియానాలు, నేలపై కాయర్ మ్యాట్‌లు, తాగునీటి పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. మైక్ ప్రసారం ద్వారా భక్తులు సూచనలు అందిస్తామన్నారు. తాత్కాలిక మరుగుదొడ్ల వద్ద నిరంతర పారిశుధ్య పనులను మునిసిపల్ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. గిరి ప్రదక్షిణ, ఇతర ముఖ్యమైన రహదారుల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విశ్రాంతి ప్రాంగణాలను సిద్ధం చేస్తున్నామన్నారు. స్నానఘాట్ల వద్ద భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇరుముడుల స్వీకరణ, ఇరుముడులలోని టెంకాయల సమర్పణకు హోమగుండాల ఏర్పాటు, లడ్డూ ప్రసాదాల విక్రయాలు వంటివన్నీ పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. స్నానఘాట్లలో వదిలివేసే ఎర్రటి వస్త్రాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ దీక్షల విరమణలకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చామని, ఈ యాప్ ద్వారా భక్తులకు కల్పించిన మౌలిక సదుపాయాలను తెలుసుకోవచ్చన్నారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. అన్ని ముఖ్య ప్రాంతాలు, కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ పారిశుధ్య అంశానికి సంబంధించి ప్రత్యేక టీమ్‌లను సిద్ధం చేశామని, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తరలించేందుకు పటిష్ట ప్లాన్‌ను తీసుకున్నామన్నారు. ఈవో రామారావు మాట్లాడుతూ దీక్షా విరమణలను విజయవంతం చేసేందుకు ప్రణాళికాయుతంగా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని లడ్డూ ప్రసాదానికి కొరత లేకుండా చూస్తున్నామన్నారు. విజయవాడ రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ చైతన్య, ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, వైకుంఠరావు, తదితరులతో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు కానుకల ఆదాయం రూ.3.68 కోట్లు



ఇంద్రకీలాద్రిపై ఒలువైన దుర్గమ్మ సన్నిధిలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను 21 రోజులకుగాను బుధవారం మహామండపం 6వ అంతస్తులో లెక్కించారు. భక్తులు సమర్పించిన కానుకల నగదు రూ.3,68,90,834, బంగారం 560 గ్రాములు, వెండి 9 కిలోల 30 గ్రాములు లభించింది. యుఎస్ఏ డాలర్లు 519, ఆస్ట్రేలియా డాలర్లు 80, ఒక కువైట్ దినార్, 204 ఖతార్ రియాల్స్, 165 ఎమిరేట్స్ దిర్హమ్స్, 516 మలేషియా రింగేట్లు, 130 సౌదీ అరేబియా రియాల్స్, 60 కెనడా డాలర్లు, 1700 ఒమాన్ బైంసాలు, ఒక రియాల్, 916 సింగపూర్ డాలర్లు, 55 మాల్దీవుల రూపియాలు హుండీల్లో లభించాయి. ఆన్‌లైన్‌లో రూ.1,16,429 చేకూరింది. డిప్యూటీ ఈవో రత్నరాజు, దేవాదాయ శాఖ అధికారులు, ఏఈవోలు, సిబ్బంది, ప్రత్యేక పోలీసులు, వన్‌టౌన్ సిబ్బంది, అమ్మవారి సేవాదారులు పాల్గొన్నారు.

దీక్ష విరమణధారులకు ఊతంగా సాంకేతికత



భవానీ దీక్షా విరమణ దారులకు ఊతంగా ఉండేందుకు సరికొత్త యాప్‌ను రూపొందించామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. విజయవాడలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబుతో కలిసి యాప్ పనితీరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దేవస్థానం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. భక్తులకు సాంకేతికంగా ఊతం ఇచ్చేందుకు ఉపకరిస్తుందన్నారు. గూగుల్ ప్లే స్టోర్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, దర్శనాల బుకింగ్, దర్శనాల సమయం, ప్రసాద కౌంటర్లు, పూజా విధానాలు, అందుబాటులో ఉన్న రవాణ సౌకర్యాలు, పార్కింగ్ ప్రదేశాల్లో రద్దీ, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, ఫిర్యాదుల నమోదు, అత్యవసర ఫోన్ నెంబర్లు, ప్రత్యేక కార్యక్రమాల వివరాలు, ఇలా సమస్త సమాచారం అందులో ఉంటుందన్నారు. ఐయానిక్ డాట్ స్టార్టర్ భవానీ లింక్ ద్వారా యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవచ్చునన్నారు. దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సాగర్ కమిటీ చైర్మన్ ఎన్నిక లాంఛనమే!

- 'కోట' నియామకంపై జిల్లా ప్రజాప్రతినిధుల సమ్మతి
- సానుకూలంగా స్పందించిన చంద్రబాబు



ఎన్ఎస్‌పీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన విప్ తంగిరాల సౌమ్య, కోట వీరబాబు

నందిగామ, డిసెంబరు 18: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఎన్టీఆర్ జిల్లా నేతలు ఏకతాటిపైకి వచ్చారు. జిల్లాకు చెందిన సీనియర్ నేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట వీరబాబుకు ఈ పదవి కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రాజెక్ట్ పరిధిలో మూడొంతుల ఆయకట్టు, అదేస్థాయిలో కాలువల విస్తీర్ణం ఉన్న తమ జిల్లాకు ఈ పదవి అప్పగిస్తేనే రైతులకు మేలు జరుగుతుందని వారు భావిస్తున్నారు. మొత్తం ప్రాజెక్ట్ పరిధిలో 17 డిస్ట్రిబ్యూటరీ కమిటీలుండగా, 13 కమిటీలు ఎన్టీఆర్ జిల్లాలోనే ఉన్నాయి. కృష్ణా, ఏలూరు జిల్లాల్లో రెండేసి కమిటీలు మాత్రమే ఉన్నాయి. ఏకపక్షంగా జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో మొత్తం కమిటీలను కూటమి సొంతం చేసుకుంది. ఎలాంటి వివాదాలు లేకుండా డిస్ట్రిబ్యూటరీ కమిటీలు కూడా ఎమ్మెల్యేలు సూచించిన వ్యక్తులే దక్కించుకున్నారు. ఈ క్రమంలో అందరి దృష్టి ఈనెల 21న జరిగే ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికపై పడింది. ప్రాజెక్ట్ పరిధి అధిక భాగం జిల్లా పరిధిలో ఉన్నందున ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తికే పదవిని కట్టబెట్టాలని జిల్లా ప్రజా ప్రతినిధులు నిర్ణయించారు. ఇప్పటికే రేస్‌లో కోట ఉండడంతో మద్దతు తెలిపారు. జిల్లాలో రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యేలు శ్రీరామ్ రాజగోపాల్, వసంత కృష్ణప్రసాద్, కొలికపూడి శ్రీనివాస్ ఆయనకు సిఫార్సు లేఖలు అందించారు. విప్ సౌమ్య ఒకడుగు ముందుకు వేసి మంగళవారం వీరబాబును సీఎం చంద్రబాబు వద్దకు తీసుకెళ్లారు. చైర్మన్ పదవిని ఆయనకు కేటాయించాలని కోరారు. జిల్లాలోని ఇతర ఎమ్మెల్యేలు, ఎంపీ కేశినేని, పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం ఇచ్చిన సిఫార్సు లేఖలను వీరబాబు సీఎంకు అందజేశారు. ప్రాజెక్ట్ పరిధి 80 శాతం ఎన్టీఆర్ జిల్లాలో ఉందని, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఆయకట్టు వివరాలను తెలిపారు. వీరబాబు చెప్పిన వివరాలను విన్న చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. అందరితో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వీరబాబు నియామకం దాదాపు ఖరారైనట్లు స్థానిక నేతలు భావిస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్న వీరబాబు పలు పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నేతతో మంచి సంబంధాలున్నాయి. మొత్తం మీద ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పదవి వీరబాబుకు దక్కడం లాంఛనంగా కనిపిస్తోంది.

హస్తకళాకారుల ఉత్పత్తులకు మార్కెటింగ్



స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శనను ప్రారంభిస్తున్న నాబార్డు సీజీఎం గోపాల్ తదితరులు

లబ్బీపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించి ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలనే లక్ష్యంతో ప్రైవేటు షాపింగ్ మాల్స్ నందు స్టాల్ ఇన్ మాల్స్ నిర్వహిస్తున్నామని నాబార్డ్ సీజీఎం ఎం.ఆర్.గోపాల్ తెలిపారు. నాబార్డ్ ఆర్థిక సహాయంతో నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పీవీపీ మాల్‌లో ఏర్పాటు చేసిన స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా గతేడాది నిర్వహించిన చేనేత వస్త్రాలు, జ్యూట్ బ్యాగులు, కలంకారీ వస్త్రాలు, కొండపల్లి బొమ్మలు, ముత్యాల దండల ప్రదర్శన వినియోగదారులను ఎంతగానో ఆకట్టుకోవడంతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం కర్నూల్‌కు చెందిన మిరాకిల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్స్ వస్త్రాలు, కేదారేశ్వర పేటకు చెందిన వేళాంగిణి మహిళా పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ జ్యూయలరీ వస్తువులు కొండపల్లి కనకదుర్గ డ్వాక్రా గ్రూప్ ఆధ్వర్యంలో కొండపల్లి బొమ్మలు, వేంకటగిరికి చెందిన మూన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేంకటగిరి చీరలు, నేత వస్త్రాలు వంటివి ప్రదర్శనలో ఏర్పాటు చేశామన్నారు. 30 మందికి పైగా బృందంగా ఏర్పడి ముందుకొస్తే వారు ఎంచుకున్న రంగంలో శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నేస్తం సంస్థ సీఈవో వి.సురేష్ మాట్లాడుతూ నాబార్డ్ సహకారంతో గత ఏడాది విశాఖపట్నం, విజయవాడలో స్టాల్ ఇన్ మాల్ నిర్వహించగా, ఇప్పుడు 90 రోజుల ప్రదర్శన నిర్వహిస్తున్నామని, ఒక్కో కళాకారుడు 15 రోజుల పాటు ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించుకునేలా అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. నాబార్డ్ ఏజీఎం మిలింద్ చౌసాల్కర్, నేస్తం డైరెక్టర్ కె.నందిని, విక్రమ్, గోపి, సహాయక బృందాల మహిళలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సాగర్ కాలువలకు పూర్వవైభవం

- నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ



నందిగామ, డిసెంబరు 18: సాగర్ కాలువలకు పూర్వ వైభవం తీసుకువచ్చి చివరి భూమల వరకూ నీటిని అందించేందుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తానని నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన చంద్రశేఖర్ బుధవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఎన్ఎస్‌పీ కాలువలు అధ్వాన్నంగా తయారయ్యాయన్నారు. కనీస మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. ఎక్కడ చూసినా కంప చెట్లతో నిండి ఉన్నాయన్నారు. తొలత కంప తొలగింపు చేపడతామన్నారు. విడుదలైన ప్రతి చుక్క నీరూ పంట పొలాలకు అందేలా కాలువలను తీర్చిదిద్దుతామన్నారు. ఆయకట్టులోని 21900 ఎకరాల భూమికి నీటిని అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. 21 కిలోమీటర్ల మేర ఉన్న కాలువలను ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సహకారంతో అభివృద్ధి పరుస్తానన్నారు. వేదాద్రి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు ప్రభుత్వం ముందుకు రావడం మంచి పరిణామమన్నారు. సాగర్ నీటితో పాటు వేదాద్రి నీటిని చివరి భూముల వరకూ అందించేందుకు కృషి చేస్తానన్నారు.

జమ్మూకశ్మీర్‌పై కర్ణాటక ఇన్నింగ్స్ విజయం

- విజయ్ మర్చంట్ క్రికెట్‌లో అద్భుత విజయం



విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మూలపాడు ఏసీఏ క్రికెట్ గ్రౌండ్స్ వేదికగా జరుగుతున్న బీసీసీఐ విజయ మర్చంట్స్ ట్రోఫీ క్రికెట్‌లో అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో సత్తా చాటిన కర్నాటక అండర్-16 జట్టు జమ్మూకాశ్మీర్‌పై ఇన్నింగ్స్ 149 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. బుధవారం ఒకేరోజు జమ్మూకాశ్మీర్ జట్టు 19 వికెట్లను కర్ణాటక జట్టు నేలకూల్చి అద్భుతం చేసింది. తొలి వికెట్‌కు 10 పరుగుల ఇన్నింగ్స్ రెండో రోజు ఆట కొనసాగించిన జమ్మూ కాశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 75 పరుగులకు ఆలౌటయ్యి, ఫాలో ఆన్ ఆడింది. రెండో ఇన్నింగ్స్‌లో ఈ జట్టు కేవలం 124 పరుగులకు కుప్పకూలి పరాజయం పాలైంది. కర్ణాటక విజయంలో అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌ల్లో అధర్వ్ 54 పరుగులు, రెండు ఇన్నింగ్స్‌ల్లో 8 వికెట్లను నేలకూల్చి సత్తా చాటాడు. ఈ విజయంతో కర్ణాటకకు 7 పాయింట్లు లభించాయి. ఉత్తరాఖండ్- జార్ఖండ్ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ 274/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆట ప్రారంభించి 433/8 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. ఈ జట్టు బ్యాటర్స్ కోరంగ 162, మయాంక్ ముదిల 150 పరుగులు చేసి సెంచరీలతో కదం తొక్కారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన జార్ఖండ్ జట్టు బుధవారం ఆట ముగిసే సమయానికి 164/5 పరుగులతో నిలిచింది. ఇంకా ఆ జట్టు 269 పరుగులు వెనుకంజలో ఉంది.

సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్‌కు ఎన్టీఆర్ వర్సిటీ టీమ్

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొట్టాయంలోని మహాత్మాగాంధీ వర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 24 వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ బాస్కెట్‌బాల్ మహిళా టోర్నీకి డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ జట్టు అక్కడకు పయనమైందని వర్సిటీ స్పోర్ట్సు బోర్డు సెక్రటరీ ఈ త్రిమూర్తి తెలిపారు. ఎంపికైన టీమ్ సభ్యులు బీ లీలా ధరణి, ఎన్ మానస, ఎస్ఎస్ఐ వైష్ణవి, పీ మల్లిక, సీహెచ్ శ్రీ సైమ్య, బీ శ్రీసాయి జ్యోతిర్మయి, డీ వైష్ణవి, వై నేహా, ఈ మృదుల, ఏ రుక్మిణి సీతాలను వర్సిటీ వీసీ డాక్టర్ డీవీఎస్ఎల్ నర్సింహం, రిజిస్ట్రార్ వీ రాధికారెడ్డి అభినందించారు. టీమ్‌కు కోచ్‌గా ఎన్ నల్లయ్య, మేనేజర్‌గా జే సిల్విబాబు వ్యవహరించనున్నారు.



ఎన్టీఆర్ వర్సిటీ బాస్కెట్‌బాల్ టీమ్‌తో వీసీ నర్సింహం

రూ.6.48 కోట్లతో సుందరీకరణ పనులు

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



విమానాశ్రయం సుందరీకరణ పనులపై అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రసాదంపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి కీలకమైన గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విజయవాడ రూరల్ రామవరప్పాడు వరకు చేపడుతున్న గ్రీనరీ సుందరీకరణ పనులు చెన్నై, బెంగుళూరును తలదన్నేలా ఉండాలని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్, గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం అయోధ్యనగర్‌లోని ఏపీజీ అండ్ బీసీ కార్యాలయంలో 13 కిలోమీటర్ల మేర 6.48 కోట్ల నిధులతో చేపడుతున్న బ్యూటిఫికేషన్ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిథులు మెచ్చేలా ఆహ్లాదకరంగా ఉండేలా సుందరీకరణ చేయాలనీ సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. అన్ని శాఖల అధికారులు ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. పశువులు, గ్రీనరీ పాడు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవేపై లైటింగ్ సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని తాను ఈ సమస్యపై ఎన్నిసార్లు చెప్పిన పరిష్కారం కాలేదని అసహనం వ్యక్తం చేశారు. బ్యూటిఫికేషన్‌లో పలు సమస్యలున్నాయని పరిష్కారించాలన్నారు. విమానాశ్రయం అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని అందుకు తగినట్టు అధికారులు పనులను చేయాలని స్పష్టం చేశారు. ఏపీజీ అండ్ బీసీ ఎండీ రాజశేఖర్ రెడ్డి, ఎన్‌హెచ్ఏఐ హెచ్ఈ నాగేశ్వరరావు, గన్నవరం సీఐ శివ ప్రసాద్, పటమట ఎస్సై హరికృష్ణ, గుణదల ఈఈ రామ మూర్తి, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ఎంకే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

గుణదల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ చదువుతున్న వారిలో నైపుణ్యతను వెలికితీసేందుకు ప్రధాని మోదీ జాతీయస్థాయిలో చేపెట్టిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో పాల్గొన్న అమరావతి ఎస్ఆర్ఎం వర్శిటీ టీమ్ ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. నగరానికి చెందిన ఆరుగురు ఈ టీమ్‌లో ప్రతిభకనబర్చారు. కేంద్రం ప్రభుత్వం వీరికి రూ.లక్ష నగదు బహుమతిని అందజేసింది. అమరావతిలోని ఎస్ఆర్ఎం వర్శిటీలో సీఎస్ఈ 4వ సంవత్సరం చదువుతున్న వీరు జాతీయ స్థాయిలో 11, 12న జమ్ము కాశ్మీర్‌లోని ఐఐటీలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. ముందుగా పోటీల్లో పాల్గొన్న వారందరితో ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా సమావేశమయ్యారు. తర్వాత నిర్వహించిన పోటీల్లో 254 సంస్థల నుంచి హాజరైన ప్రతినిధులు ప్రతిపాదించిన పలు సాంకేతిక అంశాల్లో ఏపీ నుంచి వెళ్లిన వీరు ది నేషనల్ క్రిటికల్ ఇన్ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొటెక్షన్ సెంటర్ ఇచ్చిన సైబర్ క్రైమ్‌కు సంబంధించిన అంశాన్ని పరిష్కరించి ప్రతిభ చాటుకున్నారు. ప్రధాన మంత్రి సందేశం తమకెంతో ఆదర్శంగా ఉందని మంగళవారం రాత్రి నగరానికి చేరుకున్న టీమ్ తెలిపింది. టీమ్ సభ్యులు ఎం.ఆకాష్, జె.సికిందర్, ఎస్.శశాంక్, బి.సాద్విక్, పి.చెరిష్, జె.ప్రణతి మాట్లాడుతూ తాము ఈ స్థితికి చేరుకోవడానికి ఎస్ఆర్ఎం వర్శిటీ యాజమాన్యం ఎంతగానో సహకరించిందన్నారు. తమతోపాటు 88వేల టీమ్‌లు పాల్గొన్నాయన్నారు. పలు సమస్యలను తమ దృష్టికి తీసుకురావడానికి దేశంలోని 254 సంస్థలు పాల్గొన్నాయన్నారు. అవి తమ ముందుంచిన సమస్యలను 36 గంటల్లో పరిష్కరించి ప్రదర్శించాలన్నారు. చివరకు ఫైనల్స్‌కు 5 టీమ్‌లు చేరుకోగా తాము మొదటి స్థానంలో నిలవటం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

నూరేండ్ల నా ఊరు పాటకు

రేపు గాయనీ, గాయకుల ఎంపిక



వన్‌టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్లె చరిత్ర, మానవ జీవన విధానం, సంస్కృతీ సంప్రదాయాలు, మానవీయ విలువలను భావితరాలకు అందించాలని 243 చరణాలతో రచించిన 'నూరేండ్ల నా ఊరు' గేయ కావ్యాన్ని పాడించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల నుంచి 243 మంది గాయనీ గాయకులను ఎంపిక చేయనున్నట్టు కవి, రచయిత, సంగీత దర్శకుడు వరంగల్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం విజయవాడ గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వరంగల్ శ్రీ నివాస్ మాట్లాడుతూ నూరేండ్ల నా ఊరు గేయ కావ్యాన్ని 243 మంది గాయనీ గాయకులతో సంయుక్తంగా ఆలపించేందుకు గాయకుల ఎంపిక ప్రక్రియను ఈనెల 20న ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు హనుమాన్ పేటలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కోస్తాంధ్ర జిల్లాలోని ఔత్సాహిక గాయనీ గాయకులు తరలివచ్చి సద్వినియోగం చేసుకోవాలన్నారు. గాయనీ గాయకులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వివరాలకు 95739 89134, 90008 52227 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ధ్వని అనుకరణ చక్రవర్తి భవిరి రవి, అంతర్జాతీయ జానపద కళాకారులు దామోదర గణపతిరావు, కవి, గాయకులు ఎమ్.వి.మల్లిక్ తేజ్, గాయకులు జోపాక శివ, మహేష్ గూడూరు పాల్గొన్నారు.



పెండింగ్ బకాయిల చెల్లింపునకు కృషి

- ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్

ధర్నాచౌక్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, పీఆర్సీ కమిషన్ తక్షణమే నియమించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో విజయవాడ నగరశాఖ కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల స్నేహపూర్వకంగా ఉంటోందన్నారు. ఉద్యోగుల బకాయిల అంశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సాధ్యమైనంత త్వరగా బకాయిల చెల్లింపునకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడంలో ఉద్యోగులు మరింత కృషి చేసి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. ఉద్యోగుల సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నగరాధ్యక్షుడు సీహెచ్‌వీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ సంఘంలో నగర శాఖకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రాష్ట్ర, జిల్లా నేత ఆదేశాలు, సూచనలను అమలు చేయడం, ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారంలో నగర తనదైన ముద్ర వేసుకుందన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి పదవికి ఏ విద్యాసాగర్‌ను ఎన్నుకోవాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.సత్యనారాయణరెడ్డి, పి.రమేష్, బి.సతీష్ కుమార్, నగర సభ్యులు షేక్ నాజీరుద్దీన్, డీఎస్ఎన్.శ్రీనివాసరావు, బి.రాజశేఖర్, వీవీ.ప్రసాద్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	192
చికెన్ స్కిన్‌లెస్	202

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.610

నేడు విద్యుత్ అదాలత్

అవనిగడ్డ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ రెవెన్యూ భవనంలో ఈనెల 19న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సును విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కృష్ణనాయక్ సూచించారు. విజయవాడ కన్జూమర్ గ్రీవెన్సెస్ రిడ్రెసల్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతుందని ఆయన తెలిపారు. సదస్సుకు సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ ఎస్.విక్టర్ ఇమ్మానియేలు, ఫోరమ్ సభ్యులు, జిల్లా అధికారులు విచ్చేస్తారని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అర్జీల్లో లిఖితపూర్వకంగా ఇచ్చి పరిష్కారం చేసుకోవాలని ఆయన సూచించారు.

బియ్యం మాయంపై సమగ్ర విచారణ జరపాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బందరు మండలం పొట్లపాలెం శివారు కొత్తపూడిలో పౌరసరఫరాల శాఖ బియ్యం నిల్వ ఉంచిన అద్దె గిడ్డంగుల్లో బియ్యం మాయంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. అధికారులు ముందుగా 3,807 బస్తాల బియ్యం తరుగుదల వచ్చాయని చెప్పారని, పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ 4840 బస్తాలు తరుగుదల చెప్పారని, ఇందులో వ్యత్యాసం కనబడుతోందని ఆయన అన్నారు. గిడ్డంగుల్లో స్టాకు నిల్వలు, వినియోగంపై సరైన వివరాలను ప్రభుత్వం అందించలేకపోవడం శోచనీయమన్నారు. గిడ్డంగుల కమిటీ వ్యవస్థను పటిష్టపరచాలన్నారు. మూడునెలలకోసారి తనిఖీచేసి అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలన్నారు. బియ్యం గోల్‌మాల్ వెనుక ఎంతటి పెద్దవారున్నా కఠిన చర్యలు తీసుకోవాలని నరసింహారావు డిమాండ్ చేశారు.

పేర్ని నానీపై చర్యలు తీసుకోండి

● టీడీపీ నేత దిలీప్‌కుమార్ డిమాండ్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'బఫర్ గిడ్డంగిలో నిల్వ ఉంచిన పేదల బియ్యాన్ని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) దొంగిలించారు. రూ.కోటి 70 లక్షలు కట్టి తన తప్పిదాన్ని ఒప్పుకొన్నార. అయితే ఆ కేసులో అధికారులు వింత ధోరణిని అవలంబిస్తున్నారు. మీనమేషాలు లెక్కించకుండా పేర్ని నానీపై చర్యలు తీసుకోవాలి.' అని టీడీపీ 6వ డివిజన్ నాయకుడు ఐ.దిలీప్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం తన ఇంటి వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల బియ్యం అక్రమంగా తరలి వెళుతోందని కాకినాడ పోర్టు వద్ద ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆరోపించిన సందర్భంలో పవన్‌ను పేర్ని తీవ్రంగా విమర్శించారన్నారు. గతంలో తాను మచిలీప్నటంలో దొంగ పట్టాల వ్యవహారంపై ఫిర్యాదు చేశామని, దానిపై అప్పట్లో కొల్లు రవీంద్ర తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారని తెలిపారు. ఆ వ్యవహారంపై ఎన్ని దొంగ పట్టాలిచ్చారో నిగ్గు తేల్చాలని దిలీప్ డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయని, తప్పులకు వైసీపీ నాయకులు బాధ్యులని తాను కోర్టుకు వెళ్లానని తెలిపారు. ఇష్టానుసారంగా వైసీపీ నాయకులు వెంచర్లు వేస్తున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. అధికారులు వైసీపీ నాయకుల అక్రమాలకు అడ్డుకట్ట వేసి న్యాయాన్ని బతికించాలని ఆయన కోరారు.

సమన్వయంతో పనిచేయండి

● ప్రజా ప్రతినిధులు, అధికారులకు డీఆర్పీ శ్రీనివాస్ సూచన

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని డీఆర్పీ శ్రీనివాస్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మరియకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. జల్‌జీవన్ మిషన్ కింద మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అవనిగడ్డ మండలంలోని మిగిలిన గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు కేటాయించాలని సూచించారు. అవనిగడ్డలోనూ పూర్తిస్థాయిలో జల్ జీవన్ మిషన్ పథకం కింద తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఈవోపీఆర్డీ అరుణకుమారి, కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

నాగాయలంక: పంచాయతీల సుస్థిర అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందికి బాపట్లకు చెందిన శిక్షణాధికారి కె.శ్రీనివాసరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఎంపీడీవో జె.సీతారామ్‌కుమార్, ఈవోపీఆర్డీ కె.అప్పలనరసమ్మ పాల్గొన్నారు.

రాత్రి పదిన్నరకు మచిలీపట్నం-విజయవాడ

పల్లెవెలుగు బస్సు నడపాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం నుంచి విజయవాడకు రాత్రి 9.30 గంటల తరువాత పల్లెవెలుగు ప్యాసింజర్ సర్వీసులు నడపడం లేదని, దీని వల్ల మచిలీపట్నం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే ప్రజలు, వ్యాపారులు, రైతులు ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అబ్దుల్ మతీన్ అన్నారు. బుధవారం ఆర్టీసీ అధికారులకు పీసీసీ సభ్యుడు కోకా ఫణిభూషణ్‌తో కలిసి ఆయన వినతిపత్రం అందంచారు. రాత్రి 10.30 గంటలకు గతంలో నడిపిన పల్లె వెలుగు బస్సును పునరుద్ధరించాలని కోరారు. ఆర్టీసీ డీఎం పెద్దిరాజు స్పందించాలన్నారు.

ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోండి

● రైతులకు వ్యవసాయ అధికారుల సూచన

నాగాయలంక, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నూర్చిన వరి ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని రైతులకు మండల వ్యవసాయాధికారి ఎన్.సంజీవ్‌కుమార్ సూచించారు. బుధవారం నంగేగడ్డ, పర్రచివర, గణపేశ్వరం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

21 తర్వాత కోతలు కోయండి: ఏవో

కోడూరు: మండలంలోని రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. అల్పపీడనం బలపడి రానున్న మూడు రోజులూ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపిందని, రైతులు వరి కోతలు ఈనెల 21వ తేదీ తర్వాత కోసుకోవాలని ఆయన సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో టార్పాలిన్లు



ధాన్యంపై కప్పుకొనేందుకు ఉచితంగా టార్పాలిన్లు అందజేస్తున్న తహసీల్దార్ విజయప్రసాద్, ఏవో మురళీకృష్ణ

ఘంటసాల: వాతావరణ శాఖ వర్ష సూచనల నేపథ్యంలో ధాన్యం రాశులు, బస్తాలు తడవకుండా కప్పుకోవడానికి టార్పాలిన్ పట్టాలను వినియోగించుకున్నాక తిరిగి ఇచ్చేసే ప్రాతిపదికన ఉచితంగా అందజేస్తున్నామని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పట్టాలు అందుబాటులో ఉంచామని తహసీల్దార్ బి.విజయప్రసాద్ తెలిపారు. బుధవారం రైతులకు ఆయన టార్పాలిన్ పట్టాలను అందజేశారు. మండలంలోని 12 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు కొనుగోలు కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని ఏవో కె.మురళీకృష్ణ సూచించారు. తుమ్మల చౌదరి బాబు, వేమూరి సాయి వెంకటరమణ, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

సంక్రాంతి ఉత్సవాలు తెలుగు సంస్కృతికి ప్రతీక

అవనిగడ్డ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ఉత్సవాలు తెలుగు సంస్కృతికి ప్రతీక అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో వీర్నాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్రాంతి సంబరాలు, 3కే రన్ కార్యక్రమ పోస్టర్లను తనయుడు మండలి వెంకట్రామ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. సంక్రాంతిని పురస్కరించుకుని మచిలీపట్నంలోని హిందూ కళాశాలలో జనవరి 8, 9, 10 తేదీల్లో మూడు విభాగాల్లో కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశామని ఫౌండేషన్ సభ్యురాలు మానస తెలిపారు. జనవరి 4న మాథ్స్ ఒలిపింయాడ్, వ్యాసరచన, క్విజ్, 5న చదరంగం పోటీలు 12న 3కే రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రన్నింగ్‌లో ముందుగా లక్ష్యం చేరుకున్న 25 మందికి రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులు ఇస్తామని తెలిపారు. కబడ్డీ జూనియర్స్ విజేత జట్టుకు రూ.50 వేలు, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు రూ.30 వేలు, తృతీయ స్థానం సాధించిన జట్టుకు రూ.20 వేలు, కబడ్డీ సీనియర్ జట్టుకు రూ25 వేలు, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు రూ.15 వేలు, తృతీయ స్థానం సాధించిన జట్టుకు రూ.10 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఇతర పోటీల్లో విజేతలకు రూ.10 వేలు, ద్వితీయ స్థానం పొందిన వారికి రూ.5వేలు, తృతీయ స్థానం సాధించిన వారికి రూ.2500 అందిస్తామని తెలిపారు.

పోటీల ప్రారంభోత్సవానికి రండి

● కొనకళ్ల నారాయణకు వీర్నాల ఫౌండేషన్ ఆహ్వానం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హిందూ కళాశాలలో వీర్నాల ఫౌండేషన్ నిర్వహిస్తున్న వివిధ పోటీల ప్రారంభోత్సవానికి రావాలని హిందూ కళాశాల అనుబంధసంస్థల అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావుకు ఫౌండేషన్ ప్రతినిధులు మానస తదితరులు ఆహ్వానపత్రిక అందజేశారు. జనవరి 4,5 తేదీల్లో చదరంగం, గణితం ఒలింపియాడ్, వ్యాసరచన, క్విజ్, 8,9,10 తేదీల్లో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



మంత్రి కొల్లు రవీంద్రను పరామర్శిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులవర్తి నాని

కొల్లు రవీంద్రకు పరామర్శ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోదరుడు కొల్లు వెంకటరమణ మృతిచెందినా మంత్రి కొల్లు రవీంద్ర ప్రజాసేవలో పాల్గొనడం బాధ్యతల పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనమని చంద్రగిరి ఎమ్మెల్యే పులవర్తి నాని అన్నారు. బుధవారం కొల్లు రవీంద్రను మచిలీపట్నంలో పులవర్తి నాని పరామర్శించారు. వెంకటరమణ మృతికి సంతాపం తెలిపారు.

దివి ప్రాంత నేతలు, ప్రముఖుల పరామర్శ

అవనిగడ్డ: సోదరుడు వెంకటరమణ మృతిచెందడంతో మంత్రి కొల్లు రవీంద్రను బుధవారం దివి ప్రాంతానికి చెందిన పలువురు పార్టీ నేతలు, ప్రముఖులు పరామర్శించారు. ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్, పారిశ్రామికవేత్త గడ్డిపాటి శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు, తలశిల వెంకట నరసింహారావు, మాచవరపు ఆదినారాయణ, మేడికొండ విజయ్, జనసేన తరపున నాగాయలంక డీసీ చైర్మన్‌గా ఎన్నికైన బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు తదితరులు రవీంద్రను కలిసి సానుభూతిని తెలిపారు.

చేనేత కార్మికులకు దుప్పట్లు, రగ్గుల పంపిణీ

గూడూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రరీ సైన్స్ అధ్యాపకుడు పేరిశెట్టి నాగరవి, ఆయన మిత్ర బృందం బుధవారం కప్పలదొడ్డిలో 130 మంది వృద్ధ చేనేత కార్మికులకు రూ. 30వేల విలువైన దుప్పట్లు, రగ్గులను పంపిణీ చేశారు. జె. నాగేంద్రకుమార్ (హైదరాబాద్), పూటుకూరి నాగవరప్రసాద్(పెడన), బోనగిరి సత్తిబాబు(మండపేట), బళ్ల నాగేశ్వరరావు, పేరిశెట్టి గిరిధర్, పేరిశెట్టి నాగశ్రీతేజ, మేడక విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

వెయ్యి వీధి కుక్కలకు కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయిస్తాం

● మచిలీపట్నం కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో వెయ్యి కుక్కలకు కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయించే లక్ష్యంతో పనిచేస్తున్నామని నగర కమిషనర్ బాపిరాజు తెలిపారు. నగరంలోని కుక్కలను విడతలవారీగా విజయవాడకు తీసుకెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నామన్నారు. మొదటి రోజు 23 కుక్కలను తీసుకువెళ్లి ఆపరేషన్లు చేయించామన్నారు. వీధి కుక్కలు కరిచి పలువురు అనారోగ్య బారిన పడుతున్నారని, ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి రావడంతో ప్రత్యేక జీవో విడుదల చేసిందన్నారు. ఈ జీవో మేరకు కుక్కలు పట్టేవారిని నగరానికి తీసుకొచ్చామని, వారితో వీధికుక్కలను పట్టించి విజయవాడకు తీసుకువెళుతున్నామని ఆయన తెలిపారు. కుక్కను పట్టినందుకు, రవాణాకు రూ.400 అవుతుందని, విజయవాడలో కుక్కలకు ఆపరేషన్ చేసిన వారికి రూ.1600 చెల్లిస్తున్నామని, ప్రభుత్వం నియమించిన ఏజెన్సీ ద్వారా కుక్కలు పట్టిస్తున్నామని తెలిపారు.



విజయవాడలో కుక్కలకు కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్న కమిషనర్ బాపిరాజు



పైడమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, శిరీష దంపతులు

పైడమ్మకు ప్రత్యేక పూజలు

పెడన, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతర సందర్భంగా పైడమ్మను బుధవారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, శిరీష దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో తిక్కిశెట్టి వీరవెంకట మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు, ఉత్సవ కమిటీ సభ్యులు బొడ్డు ఆనందరావు, పత్తిపాటి జయకృష్ణ, మల్లంపల్లి శ్రీనివాసరావు, బొల్లా రామచంద్రరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.

ఐదో రోజూ వైభవంగా..

పైడమ్మ జాతర బుధవారం 5వ రోజుకు చేరింది. 5వ రోజు అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో వైభవంగా జాతర జరిపించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. శిడిబండ్ల ఊరేగింపులు కోలాహలంగా నిర్వహించారు.



ఇటీవల మృతిచెందిన పెడన 14వ వార్డు కౌన్సిలర్ అనుముల నాగమల్లేశ్వరమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కౌన్సిల్ సభ్యులు

నాగమల్లేశ్వరమ్మకు ఘన నివాళి

పెడన, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఈనెల 12న మృతి చెందిన టీడీపీ 14వ వార్డు కౌన్సిలర్ అనుముల నాగమల్లేశ్వరమ్మకు సంతాపం, ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతూ మునిసిపల్ కౌన్సిల్ సభ్యులు సంతాప తీర్మానాన్ని ఆమోదించారు. సంతాపం తెలిపేందుకు బుధవారం పెడన మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షత వహించారు. వైస్‌చైర్మన్ ఎండీ ఖాజా, కమిషనర్ ఎం.గోపాలరావు, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, మట్టా శివపావని మాట్లాడారు. నాగమల్లేశ్వరమ్మ అకాల మరణం బాధాకరమన్నారు. పట్టణ అభివృద్ధికి ఆమె మంచి సహకారం అందించారన్నారు. నాగమల్లేశ్వరమ్మ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కౌన్సిల్ రెండు నిమిషాలపాటు మౌనం పాటించింది.



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, వెంకట్రామ్‌ను సత్కరిస్తున్న డీసీ చైర్మన్ బండ్రెడ్డి మల్లికార్జునరావు

రైతులకు మెరుగైన సేవలందించండి

● డీసీ చైర్మన్ బండ్రెడ్డి మల్లికార్జునరావుతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలు అం దించాలని, సాగునీరు సక్రమంగా అందేలా చూసి రైతుల మన్ననలు పొందాలని నాగాయలంక డిస్ట్రిబ్యూటరీ కమిటీ నూతన అధ్యక్షుడు బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు(చినబాబు)కు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. బుధవారం అవనిగడ్డలో ఎమ్మెల్యేను, ఆయన కుమారుడు మండలి వెంకట్రామ్‌ను చినబాబు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. మెండు లక్ష్మణరావు(చంటి), గడ్డిపాటి శ్రీనివాసరావు, తలశిల వెంకట నరసింహారావు(నాని) పాల్గొన్నారు.

సాగునీటి సమస్యల పరిష్కారానికి పనిచేయండి

కోడూరు: గత వైసీపీ ప్రభుత్వంలో తీర ప్రాంత గ్రామాల్లో రైతులు సాగునీటి కోసం ఇబ్బంది పడ్డారని, కూటమి ప్రభుత్వంలో సాగునీటి సంఘాలకు ఎన్నికైన టీడీపీ నేతలు సాగునీటి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు సూచించారు. బుధవారం పార్టీ కార్యాలయం వద్ద మండల పరిధిలో సాగునీటి సంఘాలకు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లుగా ఎన్నికైన టీడీపీ నాయకులను ఆయన సత్కరించారు. పూతబోయిన శ్రీనివాసరావు, కూరాకుల ప్రసాద్, వేములపల్లి రాజేష్ పాల్గొన్నారు.

బాలికల రక్షణ

సామాజిక బాధ్యత

కోడూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల నుంచి బాల్య వివాహాల నుంచి బాలికలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీడీపీవో శేషకుమారి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద కిశోర వికాసం మండల స్థాయి శిక్షకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి, సీహెచ్‌వో లీల, సీసీ జ్ఞానదాసు, ఈవోపీఆర్డీ వి.నాగరేవతి పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై విద్యార్థులకు అవగాహన

మోపిదేవి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సస్యపోషణ విభాగం ఆధ్వర్యంలో మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి అధ్యక్షతన సస్యపోషణ శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రేవతి జీవామృతం తయారుచేసి చూపారు. మినుము, కూరగాయ తోటలకు జీవామృతం వినియోగించొచ్చని వివరించారు. హెచ్ఎం జయంతి, ఐసీఆర్పీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కరించండి

మోపిదేవి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఎంపీపీ రావి దుర్గావాణి కోరారు. బుధవారం వెంకటాపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. తనకున్న 14 సెంట్ల ఇంటి స్థలాన్ని వేరే వ్యక్తులు ఆక్రమించుకుని నకిలీ పత్రాలు సృష్టించారని గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ మోహనరావు తెలిపారు. దొంగ పత్రాలు సృష్టించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. న్యాయం చేయాలని అధికారులకు అర్జీ అందజేశారు. సర్పంచ్ తుమ్మా సోములమ్మ, తహసీల్దార్ శ్రీవిద్య, ఆర్ఐ శ్రీనివాసరావు, సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వో వరప్రసాద్, దేవాదాయశాఖ పర్యవేక్షకుడు బి.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

దక్షిణ చిరువోలులంకలో 52 అర్జీలు

అవనిగడ్డ రూరల్: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేకాధికారి, ముడా వైస్ చైర్మన్ పద్మావతి పేర్కొన్నారు. సర్పంచ్ సనకా సుబ్రహ్మణ్యం అధ్యక్షతన దక్షిణచిరువోలులంకలో బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి 52 అర్జీలు స్వీకరించినట్లు పద్మావతి తెలిపారు. ఎఫ్‌లైన్ కోసం 20, మ్యుటేషన్ కోసం 30, ఇతర సమస్యలపై 2 అర్జీలు వచ్చాయని తెలిపారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో 22 అర్జీలు

పెడన రూరల్: భూసమస్యల పరిష్కారం కోసమే కాకుండా కుల ధ్రువీకరణ, ఇతర సర్టిఫికెట్లకోసం ప్రజలు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేయొచ్చని తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ సూచించారు. కొప్పల్లి, ముచ్చిలిగుంట, ముచ్చర్ల, కమలాపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. పాస్‌పుస్తకాల సవరణకు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం 22 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఆర్ఐ విజయలక్ష్మి, సర్వేయర్ దాస్, కార్యదర్శులు నాగరాజు, బాలకోటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	192
చికెన్ స్కిన్‌లెస్	202

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.610

శాస్త్రోక్తంగా లక్ష్మీ గణపతి హోమం

గుడివాడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థి సందర్భంగా బుధవారం లక్ష్మీగణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమగుండంలో దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పూర్ణాహుతిని సమర్పించారు. దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు(వాసు), దేవస్థాన కమిటీ చైర్మన్ శాయన రాజేష్, సభ్యులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి సమర్పిస్తున్న దేవస్థాన కమిటీ సభ్యులు

రైతులకు మేలు జరిగేలా పనిచేయండి

● డీసీ చైర్మన్లు, వైస్‌చైర్మన్లతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతాంగానికి మంచి చేసేలా సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. బుధవారం ప్రజావేదికలో తనను కలిసిన డీసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఆయన అభినందించారు. 'కూటమి ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. కాలువల్లో పూడికతీతలు చేస్తోంది. ధాన్యం అమ్మిన గంటల వ్యవధిలోనే రైతు ఖాతాల్లో నగదును జమచేస్తోంది. కృష్ణా డెల్టాలో ప్రజాప్రతినిధులందరం కలిసికట్టుగా రైతాంగశ్రేయస్సు కోసం పనిచేస్తున్నాం.' అని ఎమ్మెల్యే తెలిపారు. డీసీ ఎన్నికల్లో తనకు సహకరించిన ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్, కామినేని శ్రీనివాస్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మండలాధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, మురళి, జనసేన నాయకుడు పేర్ని జగన్ పాల్గొన్నారు.



డీసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడండి

● అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. తాను గ్రామాల్లోని తాగునీటి వ్యవస్థల నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు చేపడతానని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదని, నీటి సరఫరాలో శాఖాపరమైన సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని, సత్వర పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బుధవారం ప్రజావేదికలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకూ తాగునీటిని అందించడమే తన ఆశయమన్నారు. అధికారులు గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఫిల్టర్ బెడ్ల నిర్వహణపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ట్యాంకు ఆపరేటర్లు దృష్టి పెట్టాలన్నారు. ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏఈ సూరిబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పామర్రులో సెమీక్రిస్మస్ వేడుకలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

క్రీస్తు మార్గం అనుసరణీయం

పామర్రు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): క్రీస్తు చూపిన మార్గం శాంతి మార్గంలో అందరూ నడవదగినదని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. చల్లపల్లి రోడ్డులోని సీ కన్వెన్షన్‌లో నియోజకవర్గస్థాయి పాస్టర్ల నేతృత్వంలో బుధవారం నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బందరురోడ్డులోని సాయిదుర్గా నగర్‌లో నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ పాల్గొన్నారు.

టీడీపీ నేత వీరపనేని రాధాకృష్ణకు నివాళి

పెదపారుపూడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వానపాముల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వీరపనేని రామకృష్ణ(రాధా) మృతి చెందగా, ఆయన భౌతికకాయానికి ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీతులు చెప్పే అవినీతిపరుడు పేర్ని నానీ

● ఆయన చట్టం నుంచి తప్పించుకోలేరు: వీరంకి గురుమూర్తి

తోట్లవల్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నీతులు చెప్పే అవినీతిపరుడు మాజీ మంత్రి పేర్ని నానీ బియ్యం కుంభకోణం చేశారని, చట్టం నుంచి ఆయన తప్పించుకోలేరని, ఆయనను దోషిగా నిలబెట్టి చట్ట ప్రకారం శిక్షిస్తామని గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తన సతీమణి జయసుధ పేరుతో నిర్మించిన గోదాముల్లో నిల్వ చేసిన 185 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పేర్ని నాని పక్కదారి పట్టించారని, ఐదేళ్లలో ఎంత అవినీతి చేశారో దర్యాప్తు జరుగుతోందని గురుమూర్తి పేర్కొన్నారు.

స్టేడియం బాడీబిల్డర్ నితీశ్‌కు కాంస్యం

గుడివాడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణాజిల్లా బాడీబిల్డింగ్ పోటీల్లో ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారుడు నత్త నితీశ్‌కుమార్ 75 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడని స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ తెలిపారు. బుధవారం స్టేడియంలో నితీశ్‌ను ఆయన అభినందించారు. కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావు, మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



నితీశ్‌ను అభినందిస్తున్న ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలి

● సీఐటీయూ డిమాండ్

గుడివాడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలని, గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన మెమో 1214ను రద్దు చేయాలని, కార్మికులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్‌చేశారు. బుధవారం కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో ఈనెల 20న మచిలీపట్నంలో నిర్వహించే ధర్నా కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని, తాపీ వర్కర్లు, కార్పెంటర్లు, ప్లంబర్, రాడ్ బెండింగ్, ఎలక్ట్రీషియన్ కార్మికులు బందరు కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పట్టణ కార్యదర్శి రేపాని కొండ పాల్గొన్నారు.



ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కాపర్ కేబుల్స్ చోరీ

కూచిపూడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో మంగళవారం అర్ధరాత్రి 50 వేల విలువైన కాపర్ కేబుల్స్ చోరీ అయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు ప్రధాన గేటు తాళం, బ్యాటరీలు భద్రపరిచే గది తాళం పగులకొట్టి లోపలికి ప్రవేశించి కాపర్ కేబుల్ వైరు దొంగిలించారు. ఉదయం కార్యాలయానికి వచ్చిన ఆ శాఖ ఇంజనీర్ కూచిపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యర్థాలు తొలగించారు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గుడ్లవల్లేరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'భరించలేని దుర్వాసన' పేరుతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. నిన్నటివరకూ చేయనని మొండికేసిన కాంట్రాక్టర్‌పై అధికారులు ఒత్తిడి తేవడంతో బుధవారం మనుషులను పురమాయించి గుడ్లవల్లేరు క్యాంప్‌బెల్ కెనాల్ గేట్ల వద్ద దుర్వాసనకు కారణమైన వ్యర్థాలను, చెత్తను తొలగించారు. ఇరిగేషన్ సిబ్బంది దగ్గరుండి పర్యవేక్షించారు. ఇంకా బంటుమిల్లి రెగ్యులేటర్ వద్ద చెత్తను తొలగించాల్సి ఉందని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

భూముల రీ సర్వే ప్రారంభం

కూచిపూడి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలం వేములమడ గ్రామంలో ప్రారంభమైన రీ సర్వే ప్రాజెక్టులో నాలుగు బృందాలు పాల్గొని భూముల సర్వేను ప్రారంభించాయి. ఒక్కో బృందంలో వీఆర్వో, ఇద్దరు సర్వేయర్లు, వీఆర్ఏ ఉన్నారు. గ్రామంలో 11,054 ఎకరాలు ఉండగా, పంట కాలువలు, చెరువులాంటి ప్రభుత్వ భూములు 155 ఎకరాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ జగన్మోహనరావు, మండల సర్వేయర్ ఎ.కిషోర్‌బాబు పర్యవేక్షణలో రీ సర్వే నిర్వహిస్తున్నారు.

మండలానికి మూడు డీసీ అధ్యక్ష పదవులు



నందివాడ డీసీ-9 అధ్యక్షుడు బి.ఏసుబాబుతో సభ్యులు

నందివాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికల్లో మండలానికి చెందిన మూడు క్లస్టర్ల నాయకులకు డీసీ అధ్యక్ష పదవులు రావడం, అవి ఏకగ్రీవమవడం ఆనందంగా ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, బొర్రా సత్యనారాయణ అన్నారు. నందివాడ డీసీ-9 అధ్యక్షుడిగా బి.ఏసుబాబు, డీసీ-12 అధ్యక్షుడిగా పాలడుగు నానారావు(రుద్రపాక), డీసీ-8 అధ్యక్షుడిగా యార్లగడ్డ రవి (అరిపిరాల) ఎంపికయ్యారని తెలిపారు.



డీసీ -8 అధ్యక్షుడు యార్లగడ్డ రవి



డీసీ -12 అధ్యక్షుడు పాలడుగు నానారావు

ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొద్దు

● ప్రజలకు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సూచన

గుడివాడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజాసహకారం ఉంటేనే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని, ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయొద్దని, నిర్దేశించిన చోటే చెత్తను వేయాలని ప్రజలకు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం 11వ వార్డులో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ పట్ల అలసత్వం వహించొద్దని సిబ్బందికి ఆయన సూచించారు. టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ సయ్యద్ జబీన్ పాల్గొన్నారు.

ముగిసిన రేషన్ డీలర్ల రాతపరీక్షలు

గుడివాడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రాంగణంలో బుధవారం గుడివాడ సబ్ డివిజన్ పరిధి వారికి నిర్వహించిన రేషన్ డీలర్ల రాత పరీక్ష నిర్వహించారు. ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం పరీక్షలను పరిశీలించారు. గుడివాడ సబ్ డివిజన్ పరిధిలో 49 ఖాళీలకు 88 దరఖాస్తులు అందాయని, వాటిలో 9 తిరస్కరించామని, రాతపరీక్షకు 78మంది హాజరయ్యారని ఆర్డీవో పేర్కొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

గుడ్లవల్లేరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరులోని బీసీ కళాశాల బాలికల వసతిగృహంలో 100 మంది విద్యార్థినులకు దుప్పట్లు, టవల్స్ ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా లయన్స్ జీఎంటీ కో- ఆర్డినేటర్ ఎస్.వి.వి.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు. కౌతవరం ఉర్దూపాఠశాలలో మైనారిటీ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు మధ్యాహ్న భోజన స్టీల్‌ప్లేట్లు, స్టీల్ బౌల్స్ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు ఎస్.శశికళ, కోశాధికారి కల్యాణపు నవాబు, జిల్లా మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్ పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన సాల్మన్‌రాజు, ద్రాక్షాయణితో హెచ్‌ఎం శ్రీదేవి, పీడీలు రామారావు, మనోహరి, ఉపాధ్యాయులు

కబడ్డీ రాష్ట్ర పోటీలకు మొవ్వ హైస్కూల్ విద్యార్థులు

కూచిపూడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో ఈనెల 22 నుంచి నిర్వహించే కబడ్డీ జూనియర్స్ బాలబాలికల రాష్ట్రస్థాయి పోటీలకు మొవ్వ జడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎస్.శ్రీదేవి తెలిపారు. బాలుర విభాగంలో సాల్మన్ రాజు, బాలికల విభాగంలో మునిపల్లి ద్రాక్షాయణి ఎంపికయ్యారని తెలిపారు. పీడీలు అప్పికట్ల రామారావు, మండలి మనోహరి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

అథ్లెటిక్స్ జాతీయ పోటీలకు మొవ్వ హైస్కూల్ పీడీ ఎంపిక

రాజస్థాన్‌లోని అళ్వార్‌లో 2025 ఫిబ్రవరి 6 నుంచి 8వ వరకు నిర్వహించే 44వ జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు మొవ్వ జడ్పీ పాఠశాల పీడీ అప్పికట్ల రామారావు ఎంపికయ్యారు. బుధవారం హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు శివకోటేశ్వరరావు, జాకీర్ అహ్మద్, మేకా రాణి, మండలి మనోహరి తదితరులు రామారావును అభినందించారు.



కళాఉత్సవ్ జాతీయ పోటీలకు వెళుతున్న ఆంధ్ర నలంద మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో డీవైఈవో పద్మారాణి

ఆంధ్ర నలంద విద్యార్థులకు అభినందన

గుడివాడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కళాఉత్సవ్ జాతీయ పోటీలకు వెళుతున్న ఆంధ్ర నలంద మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుట్టి వెంకటేశ్వరరావు సామాజికసేవా సంస్థ తరఫున గుడివాడ డీవైఈవో పద్మారాణి బహుమతులను అందజేసి, అభినందించారు. బుధవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇటీవల ధింసా నృత్యం రాష్ట్ర పోటీల్లో నలంద విద్యార్థులు తృతీయ స్థానం సాధించారని, భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను సన్మానించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పుట్టి నాగలక్ష్మి, డీసీసీబీ కార్యదర్శి షేక్ జాన్‌సాహెబ్, హెచ్‌ఎం పి.లక్ష్మీస్రవంతి పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పులు.. రైతుల్లో కలవరం

పెదపారుపూడి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా రైతులు కలవరం చెందుతున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులపాటు వర్ష సూచనతో ఆందోళ చెందిన రైతులు వరి కోతలు కోసి పనలపై ఉన్న పొలాల్లో హడావిడిగా కట్టి కుప్పలు వేస్తున్నారు. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు పరదాలు కప్పి జాగ్రత్త చేస్తున్నారు. పెదపారుపూడి చెరువు గట్టు వద్ద కోసిన ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు పరదాలతో కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

గుడివాడ రూరల్: విత్తనశుద్ధి చేసిన మినుము విత్తనాలు చల్లితే పంటకు తెగుళ్లు రావని రైతులకు మండల వ్యవసాయశాధికారి బి.అనంతలక్ష్మి సూచించారు. బుధవారం కల్వపూడి అగ్రహారం, గుంటాకోడూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కొన్ని పొలాల్లో మినుము మొక్క దశలో ఉందని తెలిపారు. మినుము పంటలో పల్లాకు తెగులు రాకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వాతావరణం మేఘావృతంగా ఉన్నందున వరి పంటను ధాన్యం రాశులు ఉన్నట్లైతే త్వరగా మిల్లులకు చేర్చుకోవాలని కోరారు. వర్షం వస్తే నీరు నిల్వ ఉండకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల విస్తరణాధికారిణి వి.అనిత, రైతులు పాల్గొన్నారు.



ధాన్యం రాశులపై కప్పిన పరదాలు



వల్లూరుపాలెం రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కుసుమకుమారి

జమిందారీ భూముల సమస్యలు పరిష్కరించాలి

తోట్లవల్లూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): లంకల్లో జమిందారి భూముల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని రైతులు అర్జీలు సమర్పించారు. వల్లూరుపాలెంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. జమిందారీ భూములకు హక్కు కల్పించాలని తహసీల్దార్ ఎం.కుసుమకుమారికి రైతులు అర్జీలు అందించారు. 11 అర్జీలు అందాయి. ఎంపీటీసీ సభ్యురాలు కాసరనేని అనురాధ, నీటి వినియోగదారుల సంఘం చైర్మన్ కాట్రగడ్డ రవీంద్రబాబు పాల్గొన్నారు.

బేతవోలులో 11 అర్జీలు

గుడివాడ రూరల్: బేతవోలులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 11 మంది రైతుల నుంచి అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు తెలిపారు. ఆర్ఐ నాగబాబు పాల్గొన్నారు.

యలమర్రులో 31 అర్జీలు

పెదపారుపూడి: యలమర్రు గ్రామసచివాలయం ఎదుట నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి, మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ఎన్.నరసింహులు 31 అర్జీలను స్వీకరించారు. తహసీల్దార్ వై.రంగారావు, రీ సర్వే డిటి సుందరరావు, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్వోలు రాజాబాబు, దానియేలు పాల్గొన్నారు.

పేదరికం లేని గ్రామాలను తయారు చేద్దాం

● సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శిక్షణ తరగతుల్లో జిల్లా పరిశీలకుడు ఏడుకొండలు

తోట్లవల్లూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామంలో వచ్చే ఆదాయం లేకున్నా కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి హామీ నిధులతో పేదరికం లేని గ్రామాలను తయారు చేయొచ్చని సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ(ఎల్ఎస్‌డీజీ) జిల్లా కో ఆర్డినేటర్ డి.ఏడుకొండలు తెలిపారు. తోట్లవల్లూరులో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందికి బుధవారం రెండవ రోజు జరిగిన శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్రప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లి వాటిని లబ్ధి పొందే విధంగా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎంపీడీవో రవికాంత్, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఆదాయం పెంచడానికి కృషిచేయండి

గుడివాడ రూరల్: పంచాయతీల్లో ఆదాయాలు పెంచటానికి కార్యదర్శులు, అధికారులు కృషి చేయాలని డీఎల్డీవో వి.సుజాత సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై మండల స్థాయి రెండు రోజుల శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఎంపీడీవో డివై.విష్ణుప్రసాద్, ఈవోపీఆర్డీ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై అవగాహన

నందివాడ: గ్రామాల్లో అభివృద్ధికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై మండలంలోని వివిధ శాఖల అధికారులకు, సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. డివిజనల్ అభివృద్ధి అధికారి వి.సుజాత తెలిపారు. ఎంపీపీ పెయ్యల ఆదాం, ఎంపీడీవో మల్లేశ్వరి, ఈవోపీఆర్డీ అమీర్‌బాషా, ఏవో కోటేశ్వరరావు పాల్గొన్నారు.